ప్రజాశక్తి

శుక్రవారం 4 ఏప్రిల్ 2025

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

రూ.60 కోట్ల ప్రభుత్వ భూమిపై

బేరసారాలు!

- ఎక్స్ సర్వీస్‌మ్యాన్‌కు ఇచ్చారంటూ ప్రచారం
- పెద్ద మొత్తంలో చేతులు మారిన డబ్బులు
- పొంతన లేని రెవెన్యూ అధికారుల మాటలు
- పూర్తిగా పరిశీలన చేస్తాం : జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్



నాడు : ప్రభుత్వ భూమి అంటూ హెచ్చరిక బోర్డు



నేడు : అదే భూమిలో సాగుతున్న చదును పనులు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

రూ.60 కోట్ల విలువైన ఆ భూమి ఎక్స్ సర్వీస్‌మ్యాన్‌కు దఖలు పడినట్లు ప్రభుత్వ రికార్డుల్లో ఎక్కడా పొందుపరచబడలేదు. చినగదిలి మండల తహశీల్దార్ కార్యాలయంలో అధికారులకు కూడా ఈ విషయం తెలియదు. కలెక్టరేట్‌లోనూ వివరాల్లేవు. కానీ అక్కడ ప్రభుత్వ భూమి మాయమైపోయింది. ఎక్స్ సర్వీస్‌మ్యాన్‌కు ఇచ్చి ఉంటే ఎలా ఇచ్చారు ? ప్రభుత్వం డి నోటిఫికేషన్ చేస్తే ఇంత హుటాహుటిన ఎందుకు చేయాల్సి వచ్చింది ? ప్రభుత్వమే ప్రభుత్వ భూమిని కబ్జా చేసేసిందా ? అన్న ప్రశ్నలు ఇప్పుడు అంతటా ఉద్భవిస్తున్నాయి. స్థానికులు ఆ భూమి తమ కళ్లముందే మాయమైపోతోందంటూ వాపోతున్నారు. ఇక అసలు విషయంలోకి వెళ్తే.. విశాఖ నగరంలోని ఎండాడ ఎంకె -1 ఎదురుగాగల సత్సంగ్ ఆశ్రమానికి వెనుకగల 14/1 సర్వే నెంబర్‌లోని సుమారు 5 ఎకరాల ప్రభుత్వ భూమిని కబ్జా చేసేందుకు కొంతమంది స్కెచ్ వేశారు. ఎక్స్ సర్వీస్‌మ్యాన్‌కు ఇచ్చేసినట్టుగా కొంతమంది వ్యక్తులను తెరపైకి తీసుకొచ్చి బేరసారాలు కూడా జరిపి రూ.కోట్లు కొట్టేశారని తెలుస్తోంది. ఇక్కడ ఎకరా రూ.10 కోట్ల పైమాటే. గత ప్రభుత్వ హయాంలో 2020లో ఈ ప్రభుత్వ భూమిలో రెవెన్యూ అధికారులు బోర్డులు కూడా ఏర్పాటు చేశారు. వాటన్నిటినీ కబ్జాదారులు తొలగించేసి చదును చేసే ప్రక్రియను తాజాగా చేపట్టారు. 'ప్రజాశక్తి' ఇక్కడ భూ విషయమై దృష్టిసారించగా పలు ఆసక్తికర విషయాలు వెలుగులోకి వచ్చాయి.

క్షేత్రస్థాయిలో సాగుతున్న ప్రచారమిలా..

సర్వే నెంబరు 14/1 ప్రభుత్వ భూమిని ప్రభుత్వం డి నోటిఫికేషన్ చేసిందని, మొదటి ప్రపంచ యుద్ధంలో పాల్గొన్న ఒక వ్యక్తికి ఐదు ఎకరాలు కేటాయించిందని విశాఖ కలెక్టరేట్‌లోని భూములు, రికార్డుల ఇ - సెక్షన్ అధికారి ఒకరు 'ప్రజాశక్తి'కి తెలిపారు. ఎక్స్ సర్వీస్‌మ్యాన్ దీన్ని అమ్మేసి ఉండొచ్చని పేర్కొన్నారు. ఈ భూమిపై వివరాలు ఇవ్వాలని కోరగా చినగదిలి మండల తహశీల్దార్ కార్యాలయంలో ఉంటాయని సదరు అధికారి తెలిపారు. మండల రెవెన్యూ కార్యాలయంలో డిప్యూటీ తహశీల్దార్ మిగతా 2లో..

సరుకు రవాణాలో ఈస్ట్ కోస్ట్ రైల్వే రికార్డు

259.254 మిలియన్ టన్నులతో ముందుకు..

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : 2024-25 ఆర్థిక సంవత్సరంలో 259.254 మిలియన్ టన్నుల సరుకు రవాణాను సాధించడం ద్వారా ఈస్ట్ కోస్ట్ రైల్వే సరికొత్త రికార్డు నెలకొల్పిందని రైల్వే అధికారులు గురువారం తెలిపారు మునుపటి రికార్డులను అధిగమించి 259 మిలియన్ టన్నుల మార్కును దాటి దేశంలోని మొదటి రైల్వే జోన్‌గా ఇసిఒఆర్ అవతరించిందని వెల్లడించారు. 2023-24 ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే 3.034 మిలియన్ టన్నుల పెరుగుదల నమోదైందన్నారు. గత ఏడాదితో పోలిస్తే ఇది 1.2 శాతం వృద్ధిని సూచిస్తోందని పేర్కొన్నారు. ఈస్ట్ కోస్ట్ రైల్వే సరుకు రవాణా కార్యకలాపాలలో స్థిరంగా తన బలాన్ని నిరూపిస్తోందని తెలిపారు. వరుసగా ఆరో సంవత్సరం 200 మిలియన్ టన్నుల మార్కును దాటి చారిత్రాత్మక విజయాన్ని కొనసాగించిందని ఉద్ఘాటించారు. ఏడాది పొడవునా ఎదురవుతున్న సవాళ్లను దృష్టిలో ఉంచుకుని, జోన్ సమర్థత, వ్యూహాత్మక ప్రణాళిక, శ్రామిక శక్తి, అచెంచలమైన అంకితభావానికి నిదర్శనంగా ఈ రికార్డు నిలిచిందన్నారు. ఇసిఒఆర్‌లోని మూడు విభాగాలైన ఖుర్దా రోడ్, వాల్తేరు, సంబల్‌పూర్ అంకితభావంతో శ్రమించి గత ఏడాది గణాంకాలను అధిగమించి ఈ అద్భుతమైన ఫలితాన్ని సాధించాయన్నారు.

మాజీ ఎంపీ ఎంవివి నిర్మాణాలపై ఇడి సోదాలు ?

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

వైసిపి విశాఖపట్నం మాజీ ఎంపీ ఎంవివి.సత్యనారాయణ చేపడుతున్న నిర్మాణాల వద్ద గురువారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) అధికారులు సోదాలు జరిపినట్టు సమాచారం. ఈ విషయమై విశాఖలో విస్తృత ప్రచారం జరిగింది. గతంలో ఎండాడ వద్దగల 12.5 ఎకరాల హయగ్రీవా ప్రాజెక్టులో ఎలాగైతే ఇడి సోదాలు జరిగి ఆస్తులను అటాచ్‌మెంట్ చేశారో అలాగే గురువారమూ విశాఖ నగర నడిబొడ్డు సిరిపురం వద్దగల ఎంవివి, జివి పీక్ నిర్మాణాలపైనా ఇడి సోదాలు జరిగినట్టు, పీక్ నిర్మాణ విషయంలో భారీగా అవకతవకలు ఉన్నట్టు ప్రచారం జరిగింది. ఈ తనిఖీలు గురువారం సాయంత్రం వరకూ సాగినట్లు సమాచారం.

అలాంటిదేమీ లేదు: జివి

పీక్ నిర్మాణాలపై ఇడి సోదాలంటూ జరిగిన ప్రచారంలో నిజం లేదని మాజీ ఎంపీ ఎంవివి.సత్యనారాయణ ఆడిటర్ గన్నమనేని వెంకటేశ్వరరావు (జివి) గురువారం సాయంత్రం తెలిపారు. ఇడి అధికారులెవరూ రాలేదని, తనిఖీలు జరగలేదని, ఇదొక దుష్ప్రచారం అంటూ ఆ వార్తలను కొట్టిపారేశారు.

లేటరైట్ అనుమతులను రద్దు చేయండి

▶ వార్త 8లో..

ప్రేమోన్మాదికి రిమాండ్

▶ వార్త 3లో..

విశాఖ పోర్టులోకి అతిపెద్ద బాక్సైట్ నౌక

▶ వార్త లో..

'ఉపాధి' వేతన చెల్లింపుల్లో నాలుగో స్థానం

- పనిదినాల కల్పనలో ఐదు
- గిరిజన ఆవాసాలకు రోడ్లు
- అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి



2024-25 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ చట్టం అమల్లో జిల్లా తన స్థానాన్ని పదిలపర్చుకున్నట్టు కలెక్టర్ విజయ కృష్ణన్ గురువారం తెలిపారు. రాష్ట్రంలో సగటు వేతన చెల్లింపులో నాలుగో స్థానం, కూలీలకు పనిదినాల కల్పనలో ఐదో స్థానం జిల్లాకు లభించినట్టు వెల్లడించారు. రూ.516.65 కోట్లలో వేతనం కింద రూ.350.29 కోట్లు, మెటీరియల్ కింద రూ.154.79 కోట్లు, పరిపాలన అవసరాల కింద రూ.11.57 కోట్లు ఖర్చయినట్టు తెలిపారు. లక్ష్యానికి మించి పనిదినాలు కల్పించామన్నారు. ఉపాధి హామీ చట్టం కింద 120 లక్షల పని దినాల లక్ష్యంలో 124.67 లక్షల పని దినాల కల్పనతో రాష్ట్రంలో ఆరో స్థానంలో నిలిచినట్టు తెలిపారు. కూలీలకు సగటున రోజువారీ వేతనం రూ.281 చెల్లించి రాష్ట్రంలో నాలుగో స్థానంలో నిలిచినట్టు చెప్పారు. అభివృద్ధి, ఉపాధి కల్పన, ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాల అమలులో నిర్దేశించిన లక్ష్యాల్లో ప్రగతి కనబర్చినట్లు వివరించారు. 2025-26లో 127 లక్షల పని దినాల లక్ష్యాన్ని అధిగమించి మొదటి స్థానంలో జిల్లా నిలిచేలా కృషిచేయాలని సూచించారు. కూలీలకు సగటు రోజువారీ వేతనంగా 281 రూపాయలు చెల్లించి రాష్ట్రంలో నాలుగో స్థానంలో, కూలీలకు సగటున 59 రోజుల పని కల్పించి ఐదో స్థానంలో, 124.67 కోట్ల పనిదినాలు కల్పించి ఆరో స్థానంలో, 29,740 కుటుంబాలకు 100 రోజుల పని కల్పించి ఐదో స్థానంలో, 74 శాతం రిజిస్టరు చేసుకొన్న జాబ్ కార్డుదారులకు పని కల్పించి ఆరో స్థానంలో జిల్లా నిలిచిందని మిగతా 2లో..

నియంతృత్వం వైపు దేశం

- ప్రజలు అప్రమత్తతలో మెలిగి రాజ్యాంగ హక్కులను కాపాడుకోవాలి
- సుప్రీంకోర్టు న్యాయవాది పొత్తూరి సురేష్ కుమార్

ప్రజాశక్తి - ఉక్కునగరం : 2014 నుంచి దేశంలో రాజ్యాంగ హక్కులు ఒక్కొక్కటిగా కాలరాయబడుతున్నాయని, ప్రస్తుతం దేశం నియంతృత్వం వైపునకు వెళ్తోందని, ప్రజలు చైతన్యంతో మెలిగి హక్కులను కాపాడుకోవాలని సుప్రీంకోర్టు న్యాయవాది, రచయిత పొత్తూరి సురేష్ కుమార్ అన్నారు. నేడు దేశంలో బుల్డోజర్ జస్టిస్ అమలు జరుగుతోందని పేర్కొన్నారు. కెవిపిఎస్, ఎపిజిఎస్ ఆధ్వర్యంలో ఉక్కు నగరంలో 'రాజ్యాంగాన్ని కాపాడుకుందాం - దేశాన్ని కాపాడుకుందాం' అనే అంశంపై సదస్సు జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య ఫలాలను పాలకులు కాలరాస్తున్నారని, ప్రజల సమస్యలను పక్కదారి పట్టిస్తున్నారని తెలిపారు. మత విద్వేషాలు రగులుస్తున్నారన్నారు. ఏ



సదస్సులో మాట్లాడుతున్న సురేష్ కుమార్

బట్టలు వేసుకోవాలి ? ఏం తినాలి ? అన్నది వారే నిర్ణయిస్తున్నారన్నారు. రాజ్యాంగంలో పొందుపరిచిన సోదర భావానికి విఘాతం కలిగిస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా మెలగాలని అన్నారు. స్టీల్ సిఐటియు పూర్వ మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

బేరసారాలు !

రాజేష్‌ను ఈ సర్వే నెంబరు ప్రభుత్వ భూమి అయినందున ఎలా ఇచ్చారని 'ప్రజాశక్తి' అడగ్గా 'ప్రభుత్వం నుంచి కలెక్టరేట్‌కు సమాచారం వచ్చిందని, తమ వద్ద ఎలాంటి కాగితాలూ లేవని' బదులిచ్చారు. జిల్లా జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ మాత్రం ఈ భూ వ్యవహారాన్ని పరిశీలిస్తామని, గతంలో ప్రభుత్వ భూమి ఎలా ఇచ్చారో విచారణ జరిపిస్తామని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో 14/1 సర్వే నెంబరు రికార్డుల ప్రకారం ఈ భూమి కాపాడబడిందని స్థానికులు తెలిపారు. గడచిన కొద్దిరోజులుగా ఈ భూమిని యంత్రాలతో కొందరు చదును చేయడంతో తామంతా అవాక్కయ్యామన్నారు. తీరా ఆరా తీస్తే స్థానిక రాజకీయ పెద్దలున్నారని తెలిసిందని 'ప్రజాశక్తి'కి వివరించారు.

ఇప్పటికీ ప్రభుత్వ భూమిగానే ఉంది: సబ్ రిజిస్ట్రార్ చక్రపాణి

మధురవాడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రికార్డులను పరిశీలించిన పిదప సబ్ రిజిస్ట్రార్ చక్రపాణి 14/1 సర్వే నెంబరుపై సమాచారమిస్తూ... 'ఇప్పటికీ ఎవ్వరూ కొన్నట్లు, అమ్మినట్లు మా వద్దకు రాలేదు. మా రికార్డుల్లో ప్రభుత్వ భూమిగానే ఉంది' అని తెలిపారు.

తాజాగా ఏం జరుగుతోంది ?

భూమి ప్రభుత్వం నుంచి ఎక్స్ సర్వీస్‌మ్యాన్‌కు బదలాయింపు కాకుండానే, కాగితాలు, రికార్డులు లేకుండానే ఈ భూమిపై ఆర్థిక లావాదేవీలు జరిపారన్నది స్పష్టంగా వెల్లడవుతోంది. భూమిని చూపించి చదును చేసేసి రూ.కోట్లు అడ్వాన్సుగా కొంతమంది రాజకీయ నాయకులు పొందడంతో ఈ వ్యవహారం గుప్పుమంది. ఇప్పటికైనా అనధికార లావాదేవీలపై జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేందిర ప్రసాద్, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ లోతైన విచారణ జరపాలన్న డిమాండ్ స్థానికుల నుంచి వినిపిస్తోంది.

నియంతృత్వం వైపు దేశం

ప్రధాన కార్యదర్శి ఎం.కృష్ణారావు మాట్లాడుతూ దేశంలోని ప్రతి పౌరునికీ రాజ్యాంగంలో హక్కులు ఉన్నాయన్నారు. సదస్సుకు అధ్యక్షత వహించిన కెవిపిఎస్ నాయకులు టి.చిరంజీవి మాట్లాడుతూ అట్టడుగు ప్రజలకు హక్కులు అందించేందుకు ప్రతినబూనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్‌సి, ఎస్‌టి వెల్ఫేర్ అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్.సత్యనారాయణ, బిసి ఎంప్లాయిస్ యూనియన్ ఉపాధ్యక్షులు, బిఎమ్ఎస్ఇఫ్ ఇన్‌ఛార్జి గురాసింగ్ పాల్గొన్నారు.

'ఉపాధి' వేతన చెల్లింపుల్లో నాలుగో స్థానం

తెలిపారు. ఉపాధి హామీ చట్టంలో 1830 ఎకరాలలో పండ్ల తోటల పెంపకం ద్వారా 1648 మంది రైతులు లబ్ధిపొందారన్నారు. 120 ఎకరాల ప్రభుత్వ భూములలో కొబ్బరి మొక్కలు వేసినట్లు తెలిపారు. పల్లె పండగలో 745 గోకులం షెడ్లు, రూ.181.22 కోట్లతో 229.09 కిలోమీటర్ల సిసి, బిటి రోడ్లు, రూ.24.95 కోట్లతో 308 పాఠశాలలకు ప్రహరీల నిర్మాణం, రూ.1.67 కోట్లతో 89 నర్సరీలు, రూ.13 కోట్లతో 44 పట్టు పరిశ్రమ పనులు మంజూరు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. రోడ్డు సదుపాయాల్లేని 17 గిరిజన ఆవాసాలకు రూ.21.89 కోట్లతో 22.18 కిలోమీటర్ల రోడ్లు మంజూరు చేసినట్లు చెప్పారు. 2025-26లో 127 లక్షల పని దినాలలో మంజూరు చేసిన 215 పశువుల తాగునీటి తొట్టెలు, 451 కిలోమీటర్లలో పంట కాలువల పునరుద్ధరణ, సాగునీటి పారుదల అభివృద్ధి కోసం చెరువుల సమగ్ర అభివద్ధికి 977 పనులు ప్రారంభించి పూర్తిచేయాలని ఆదేశించారు.

విఎంఆర్‌డిఎలో కార్మికుల తొలగింపు అన్యాయం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విఎంఆర్‌డిఎ పరిధిలో వివిధ పార్కుల్లో 30 ఏళ్లుగా పనిచేస్తున్న 11 మంది గార్డెన్ కార్మికులను అధికారులు తొలగించడం అన్యాయమని విఎంఆర్‌డిఎ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ప్రధాన కార్యదర్శి వి.కృష్ణారావు అన్నారు. వారిని తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని లేదా పనిచేసిన కాలానికి గ్రాట్యుటీ, సెలవులు, బోనస్‌లు చెల్లించాలని డిమాండ్ చేశారు. గురువారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద తొలగించిన కార్మికులతో కలిసి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విఎంఆర్‌డిఎ సొసైటీ కార్మికులుగా ఉన్న 11 మందిని 60 ఏళ్లు నిండాయన్న నెపంతో తొలగించడం దుర్మార్గమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 62 ఏళ్లకు వయో పరిమితిని పెంచిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. ప్రభుత్వ సంస్థలో గార్డెన్ కార్మికులకు ఇఎస్ఐ, పిఎఫ్, వారంతపు, ప్రభుత్వ, పండగ సెలవులు, గ్రాట్యుటీ వంటి ఏ కార్మిక చట్టాలనూ అమలు చేయడానికి అధికారులు, విఎంఆర్‌డిఎ ఛైర్మన్, కార్మిక శాఖ అధికారులు ఎందుకు పూనుకోవడం లేదని ప్రశ్నించారు. కార్యక్రమంలో కార్మికులు రాంబాబు, శ్రీను, నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న కార్మికులు

జర్నలిస్టుల క్రీడలు అభినందనీయం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : సమాజాభివృద్ధికి నిరంతరం పాటుపడుతున్న జర్నలిస్టులు క్రీడా పోటీలు నిర్వహించుకోవడం అభినందనీయమని సంఘ సేవకులు, ఉపకార్ ఛారిటబుల్ ట్రస్ట్ అధినేత డాక్టర్ కంచర్ల అచ్యుతరావు కొనియాడారు. ఇందిరా ప్రియదర్శిని మున్సిపల్ కార్పొరేషన్ స్టేడియంలో నిర్వహిస్తున్న వైజాగ్ మీడియా క్రికెట్ టోర్నీ గురువారంతో ముగిసింది. ముగింపు వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమానికి తన వంతు సహకారం నిరంతరం అందిస్తానన్నారు. గౌరవ అతిథిగా హాజరైన జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ విజేతలు ఎవరైనప్పటికీ ఎంతోమంది క్రీడాకారులు ఉత్సాహంగా ఈ టోర్నమెంట్‌లో పాల్గొనడం అభినందనీయమన్నారు. విజేతగా నిలిచిన వెబ్ టైగర్స్ జట్టుకు, లోకల్ టీవీ రిపోర్టర్ల జట్టుకు అతిథుల చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు.

విశాఖ పోర్టులోకి అతిపెద్ద బాక్సైట్ నౌక

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ పోర్టులోని వేదాంత అల్యూమినియం జనరల్ కార్గో బెర్త్ ప్రైవేట్ లిమిటెడ్ (విజిసిబి) భారతీయ నౌకాశ్రయ రంగంలో కొత్త మైలురాయిని చేరుకుంది. దేశంలోకి ఇప్పటివరకు వచ్చిన అతిపెద్ద బాక్సైట్ నౌకలలో ఒకటైన ఎంవి కెప్టెన్ లియోనిడాస్‌ను విజయవంతంగా బెర్త్ చేసింది. ఈ నౌక 1,99,500 మెట్రిక్ టన్నుల బాక్సైట్‌ను తీసుకువచ్చింది. ఇది పోర్ట్ కార్గో నిర్వహణ సామర్థ్యాన్ని తెలియజేస్తోంది. ఎంవి కెప్టెన్ లియోనిడాస్ విజయవంతంగా పోర్టుకు చేరడం విశాఖపట్నం పోర్టును అంతర్జాతీయ బాక్సైట్ వ్యాపారంలో ప్రధాన కేంద్రంగా మార్చడానికి తోడ్పడుతుందని అధికారులు చెబుతున్నారు. గత ఏడాది ఎంవి హువాహైన్ నౌక విజిసిబి టెర్మినల్‌కు విజయవంతంగా చేరింది. 1,99,900 మెట్రిక్ టన్నుల మాంగనీస్ ఓర్‌ను అది డెలివరీ చేసింది. ఇది భారతదేశంలోని ఏ పోర్ట్‌కైనా వచ్చిన అతిపెద్ద సింగిల్ కార్గో షిప్‌మెంట్‌గా నిలిచింది. ఈ సందర్భంగా విజిసిబి చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, డైరెక్టర్ చిక్కాల సతీష్ కుమార్ మాట్లాడుతూ తాజా మైలురాయి తమకు గొప్ప గౌరవాన్ని కలిగించిందన్నారు. భారతదేశ నౌకాశ్రయ రంగానికి తమ సహకారాన్ని కొనసాగిస్తూ.. ఇంత భారీ కార్గోను కేవలం ఐదు రోజుల్లో దిగ్విజయంగా అన్‌లోడ్ చేయడం గొప్ప విషయంగా భావిస్తున్నామన్నారు. ఇది తమ ఆపరేషనల్ ఎక్సలెన్స్‌కు నిదర్శనమన్నారు.



పోర్టుకు చేరిన కెప్టెన్ లియోనిడాస్ నౌక

ప్రేమోన్మాది దాడి అమానుషం : గంటా

ఎంవిపి.కాలనీ : స్వయంకృషినగర్‌లో ప్రేమోన్మాది దాడి సంఘటన తనను తీవ్రంగా కలచివేసిందని భీమిలి శాసన సభ్యులు గంటా శ్రీనివాసరావు అన్నారు. గురువారం ఉదయం ఆయన వెంకోజీపాలెం మెడికవర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నక్కా దీపికను బిజెపి ఫ్లోర్ లీడర్, ఉత్తర నియోజకవర్గ శాసన సభ్యులు విష్ణుకుమార్ రాజుతో కలిసి పరామర్శించారు. బాధితురాలికి ప్రభుత్వం అండగా నిలుస్తుందని ధైర్యం చెప్పి, ఆమెకు మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లను గంటా కోరారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రేమోన్మాది దాడి అమానుషమైనదన్నారు. అతడిని కఠినంగా శిక్షిస్తామని తెలిపారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గంటా

ప్రజాశక్తి -తగరపువలస : జివిఎంసి నిధులు రూ.1.91కోట్లతో 1,2 వార్డులో పలు అభివృద్ధి పనులకు గురువారం స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాస రావు శంకుస్థాపన చేశారు. ఒకటో వార్డులో గణేష్ థియేటర్ నుంచి సంతపేట సచివాలయం మీదుగా కృష్ణా కాలేజీ కల్వర్టు వరకు రూ 12.58 లక్షలతో రోడ్డు పునర్నిర్మాణ పనులకు, బంగ్లా మెట్ట అంగన్వాడీ కేంద్రం సమీపంలో రూ 17.49 లక్షలతో సిసి రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అలాగే రెండో వార్డులో జాతీయ రహదారి నుంచి వలంద పేట రామాలయం వరకు రూ 1.05 కోట్లతో రోడ్డు పునర్నిర్మాణ పనులకు, రూ 19. 20 లక్షల తో వి9 అపార్ట్ మెంట్ నుంచి అనిట్స్ కాలేజీ డబుల్ రోడ్డు వరకు, రూ 28.20 లక్షలతో అక్షరి మెడోస్ నుంచి ఇడ దాసరిపేట వరకు సిసి రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో రెండో వార్డు కార్పొరేటర్ గాడు చిన్ని కుమారి లక్ష్మి, పార్టీ నాయకులు,

విద్యార్థులకు దంత వైద్య పరీక్షలు

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక కేటిన్‌పేటలో ఉన్న బ్లూమింగ్ స్టార్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ యాజమాన్యం ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులకు ఉచితంగా దంత వైద్య పరీక్షలు చేశారు.ంత వైద్యులు హెచ్ శిరీష పాల్గొని, దంత సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రతి రోజూ కనీసం రెండుసార్లు దంతాలను శుభ్ర పరుచుకోవాలని, మాంసకతులు ఆహారంగా తీసుకునేటప్పుడు తప్పని సరిగా దంతాలను శు భ్ర పరుచు కోవాలన్నారు. పాఠశాల కరస్పాండెంట్ సుకుమార్, ప్రిన్సిపల్ కె రాజరాజేశ్వరి, వైస్ ప్రిన్సిపల్ పద్మజ పాల్గొన్నారు

గర్భిణులకు అవగాహన

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక సిహెచ్‌సిలో గురువారం గర్భిణులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఆసుపత్రిలో గర్భిణులకు అందిస్తున్న సేవలను, ఆసుపత్రి ప్రసవాల వల్ల కలిగే ప్రయోజనాలను ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఎం.ఫణికుమార్, గైనకాలజిస్ట్ డాక్టర్ పి విజయశ్రీ, హెడ్ నర్స్ ఎం వినుత వివరించారు. సాధారణ ప్రసవం అయ్యేందుకు ఆరోగ్యపరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. తల్లి, పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంగా ఉండాలంటే సూచనలు చేశారు.

హౌస్ కమిటీ స్థలాల క్రమబద్ధీకరణకు చర్యలు

• జిఒ 45 కింద తక్షణం దరఖాస్తు చేసుకోండి : ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లా

ప్రజాశక్తి -గాజువాక : గాజువాక హౌస్ కమిటీ బాధితుల ఇళ్లస్థలాల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, జిఒ 45 పరిధిలోనిబాధితులంతా వెంటనే దరఖాస్తు చేసుకోవాలని గాజువాక ఎమ్మెల్యే, టిడిపిరాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు సూచించారు. గురువారం పాత మున్సిపల్ కార్యాలయం ఎదుట బాధితులతో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే పల్లా మాట్లాడుతూ, జిఒ 301కి అనుబంధంగా జారీ చేసిన జిఒ 45 ప్రకారం 2023 డిసెంబరు 31నాటికి ఉన్న వారందరి ఇళ్లను క్రమబద్ధీకరిస్తామన్నారు. గాజువాక హౌస్ కమిటీ పరిధిలో ఐదు మంది వరకు ఎలాంటి దరఖాస్తు చేసుకోలేదని, వారందరూ జిఒ 45 ప్రకారం దరఖాస్తు చేసుకుంటే క్రమబద్ధీకరణ చేస్తామన్నారు. గెడ్డలపై ఉన్న వాటి విషయంలో ఇంకా స్పష్టత రాలేదని, వాటినీ పరిష్కరిస్తామన్నారు. అయితే జిఒ 301 కింద దరఖాస్తు చేసుకుని, పరిష్కారం కాని వారు, మరలా దరఖాస్తు చేయొద్దని సూచించారు. జిల్లా జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ మాట్లాడుతూ, మూడు దశాబ్దాలుగా ఉన్న గాజువాక హౌస్ కమిటీ సమస్యలో గతంలో జిఒ 301 ద్వారా కొందరి సమస్య పరిష్కరిచంగా, మిగిలిన వారి కోసం జిఒ 45 తీసుకొచ్చామన్నారు. దీన్ని బాధితులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో గాజువాక తహసిల్దార్ శ్రీవల్లి, సిపిఎం నాయకులు కె.కిరీటం, కూటమి నాయకులు, హౌస్ కమిటీ బాధితులు. పాల్గొన్నారు.

ఒంటి పూట బడులు అమలు చేయాలి

ప్రజాశక్తి - ఆరిలోవ : వేసవిలో అధిక ఉష్ణోగ్రతలు నమోదౌతున్న నేపథ్యంలో అన్ని యాజమాన్యాల్లోని పాఠశాలల్లో శత శాతం ఒంటి పూట బడులు పక్కగా అమలు చేయాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం తెలిపారు. ఇప్పటికే కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు అధికారులకు ఆదేశాలు జారీ చేసారన్నారు. రాష్ట్ర విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. 9, 10 తరగతులకు ప్రత్యేక తరగతుల పేరిట సాయంత్రం వేళల్లో పరోక్షంగా తరగతులు నిర్వహిస్తున్నట్టు కమిషన్ దృష్టికి వచ్చిందన్నారు.నిబంధనలు పాటించని పాఠశాలల గుర్తింపు రద్దుతో పాటు క్రిమినల్ చర్యలు తప్పవని హెచ్చరించారు.

7 నుంచి స్వయం ఉపాధి శిక్షణ

ప్రజాశక్తి - ఆరిలోవ : మహిళలు, కౌమార బాల బాలికల కోసం 30 ఏళ్లుగా పనిచేస్తున్న ఉర్వి విక్రమ్ ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఈనెల 7 నుంచి జూన్ రెండో వారం వరకు వేసవి ప్రత్యేక ఉచిత శిక్షణా తరగతులను ప్రారంభించనున్నట్టు సంస్థ ప్రాజెక్టు కోఆర్డినేటర్ హరి వెంకట రమణ తెలిపారు. ఆరిలోవ పాత పోలీస్‌స్టేషన్‌ను ఆనుకొని ఉన్న తుఫాన్ భవనంలో ప్రతి రోజూ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు శిక్షణ తరగతులు ఉంటాయన్నారు. గార్మెంట్ మేకింగ్, ఆర్యావర్క్, మగ్గం వర్క్, జ్యూట్ బ్యాగుల తయారీలో మహిళలకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు.

శిక్షణకు వయోపరిమితి లేదని,స్థానికులకు మొదటి ప్రాధాన్యత ఉంటుందన్నా ఆసక్తి గలవారు సంస్థ ప్రోగ్రాం ఆఫీసర్ జి.సావిత్రిని ఫోన్ 7093429202 నెంబరులో సంప్రదించ వచ్చున్నారు.

బోర్‌వెల్ ఏర్పాటుకు శంకుస్థాపన

ప్రజాశక్తి -తగరపువలస : స్థానిక వ్యాపారవేత్త యు.తాతాజీ ఆర్థిక సాయంతో, చిట్టివలస ప్రగతి పట్టణ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో చిట్టివలస శ్మశానవాటికలో బోర్‌వెల్ ఏర్పాటు పనులకు గురువారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షులు జె రమణ, మాజీ కౌన్సిలర్ పిట్ట సురేష్, గ్రామ పెద్దలు రంగూరి రాంబాబు, ఎర్నింటి వెంకటరమణ, పల్లా అప్పలకొండ, కమిటీ సభ్యులు నార్ల నాగ భూషణం, చిన్ని, సత్తిబాబు, టిడిపి నాయకులు నరవ రామారావు, తాటిపూడి అప్పలరాజు, ఎం సుబ్బారావు పాల్గొన్నారు

నూతన సభ్యుల నియామకం

ప్రజాశక్తి- వేపగుంట : జివిఎంసి 94వ వార్డు ఐహెచ్ఆర్.సి జాతీయ ప్రధాన కార్యాలయంలో సంస్థ జాతీయ అధ్యక్షుడు రాజాన ప్రసాదరావు ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన సాదారణ సభ్యసమావేశంలో నూతన సభ్యులుగా జె. శ్రీనివాస్, ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి ఎ. రాంబాబును ఎపి రాష్ట్ర దర్యాప్తు అధికారిగా నియమించారు. ఈ సందర్భంగా ప్రసాదరావు మాట్లాడుతూ గ్రామస్థాయిలో మానవ హక్కులపై అవగాహన, అర్హులకు ప్రభుత్వ పథకాలు అందిపుచ్చుకునేలా చైతన్య పరుస్తున్నట్లు వెల్లడించారు. బెట్టింగ్ యాప్స్, డ్రగ్స్ నివారణపై చైతన్య సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 8న విజయ నగరంలో ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.జాతీయ కార్యదర్శి ఆర్. ఈషిత, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి. సత్యనారాయణ ఉపాధ్యక్షుడు బి. రమేష్‌కుమార్, విశాఖపట్నం జిల్లా ఉపాధ్యక్షుడు రమేష్ కుమార్. ఆర్గనైజింగ్ సెక్రటరీ మహేష్, పల్నాడు జిల్లా అధ్యక్షుడు ఎం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

ప్రజాశక్తి -మధురవాడ : జాతీయ రహదారిపై మారికవలస కూడలి వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం పాలవ్వగా, మరొకరి తీవ్రగాయాలయ్యాయి. ఘటనకు సంబంధించి పిఎం పాలెం సిఐ జి.బాలకృష్ణ తెలిపిన వివరాలివి. జివిఎంసి ఐదో వార్డు కొమ్మాది సాయిరామ్ కాలనీలో నివాసముంటున్న తాపీ మేస్త్రి బలగ ప్రభాకర్రావు(49) గురువారం కె.కామేశ్వరరావు అనే వ్యక్తితో కలిసి బైక్‌పై తాళ్లవలస వెళుతుండగా, మార్గమధ్యలో మారికవలస వద్ద వీరు ప్రయాణిస్తున్న బైక్‌ను లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో లారీ వెనుక చక్రాల కింద ఇరుక్కోవడంతో ప్రభాకరరావు ఆక్కడకక్కడే మృతి చెందాడు. మరో వ్యక్తి కామేశ్వరరావుకు గాయాలు కాగా చికిత్సకు ఆసుపత్రి కి తరలించారు. మృతుని భార్య మణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు.

ప్రేమోన్మాదికి రిమాండ్

ప్రజాశక్తి -మధురవాడ : తాను ప్రేమించిన యువతినిచ్చి పెళ్లిచేయడంలేదనే ఆక్రోషంతో దాడికి పాల్పడిన ప్రేమోన్మాది నవీన్‌ను అరెస్ట్ చేసి గురువారం రిమాండ్‌కు తరలించినట్లు పిఎం.పాలెం సిఐ జి.బాలకృష్ణ తెలిపారు.. పిఎం పాలెం పోలీస్‌స్టేషన్ పరిధిలోని కొమ్మాది స్వయంకృషి నగర్‌లో బుధవారం లక్ష్మి అనే మహిళతోపాటు ఆమె కుమార్తెపై పాలకొండకు చెందిన నవీన్ దాడి చేసిన సంఘటన పాఠకులకు తెలిసిందే. ఈ దాడిలో లక్ష్మి మృతి చెందగా ఆమె కుమార్తె గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది. ప్రేమించిన యువతితో పెళ్లి కాలేదని నవీన్ దాడిచేసినట్లు పోలీసులు నిర్ధారించారు. నిందితుడు నవీన్‌ను నార్త్ జోన్ ఎసిపి అప్పలరాజు ఆధ్వర్యంలో సీఐ జి. బాలకృష్ణ బందం శ్రీకాకుళం జిల్లా బూర్జ సమీపంలో అదుపులోకి తీసుకుని, గురువారం కోర్టులో ప్రవేశ పెట్టగా, న్యాయమూర్తి రిమాండ్ విధించారని సిఐ తెలిపారు.

రెండు కార్లు ఢీకొని ఆరుగురికి గాయాలు

ప్రజాశక్తి -పద్మనాభం: మండలంలోని మద్ది గ్రామం సమీపంలో పద్మనాభం నుంచి సింహాచలం వెళ్లే రోడ్డులో గురువారం మధ్యాహ్నం, విజయనగరం, సింహాచలం వైపు నుంచి వస్తున్న రెండు కార్లు బలంగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో రెండు కార్ల ముందు భాగం నుజ్జునుజ్జయి, ఇంజన్ భాగం పూర్తిగా పాడైపోయింది విజయనగరం నుంచి వస్తున్న కార్డులో విశ్రాంత తహశీల్దార్ సిహెచ్ లక్ష్మీప్రసాద్, ప్రస్తుతం విఎంఆర్‌డిఎలో పనిచేస్తున్న ఎంరాజేష్ ఉన్నారు. మరోకారులో ముగ్గురు వ్యక్తులు ఉన్నారు.ఈ ప్రమాదంలో రెండు కార్లకు బాగా నష్టం వాటిల్లినప్పటికీ, అందులో ప్రయాణిస్తున్న ఆరుగురు వ్యక్తులు స్వల్పగాయాలతో బయటపడ్డారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు రుణాలకు ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్వయంఉపాధి రుణాలను దరఖాస్తు చేసుకున్న బిసి, కాపు, బ్రాహ్మణ, క్షత్రియ, రెడ్డి, వైశ్య, ఇబిసి తరగతుల యువతకు ఈ నెల 4న ఉదయం 10 గంటలకు స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులను ఎంపిక చేయనున్నట్లు ఎంపిడిఒ ఎన్ హనుమంతరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నిర్దేశిత గడువులోగా ఆన్‌లైన్‌లో 489 మంది దరఖాస్తు చేసుకోగా, బిసి కార్పొరేషన్, వివిధ బ్యాంకుల అధికారుల సమక్షంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తా రన్నారు. ఆన్‌లైన్ దరఖాస్తు, ఆధార్, రేషన్, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు మూడు సెట్ల జిరాక్సులతో ఇంటర్వ్యూకు రావాలని ఎంపిడిఒ సూచించారు

రికార్డులను సక్రమంగా నిర్వహించాలి

ప్రజాశక్తి- సీతమ్మధార : జిల్లాలోని 73 ప్రభుత్వాసుపత్రుల్లో డెంగీ, మలేరియా జ్వరాలకు సంబంధించి అన్ని రికార్డులను సక్రమంగా నిర్వహించాలని జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు సూచించారు. గురువారం డిఎంహెచ్ఒ కార్యాలయంలో అన్నిసిహెచ్‌సిలు, యుపిహెచ్‌సిలు, పిహెచ్‌సిలకు పంపిణీ చేయాల్సిన డెంగీ, మలేరియా జ్వరాలకు రిజిస్టర్లు, చార్టులను ఆవిష్కరించి, సంబంధిత ల్యాబ్ టెక్నీషియన్లకు అందజేశారు.

ఈ సందర్భంగా డిఎంహెచ్ఒ డాక్టర్ జగదీశ్వరరావు మాట్లాడుతూ, ఆయా రిజిస్టర్లను సక్రమంగా నిర్వహించి,డైలీ, వీక్లీ, మంత్లీ, యాన్యువల్ నివేదికలను ఎప్పటికప్పుడు పంపాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎఎంఒ చిత్రాడ సత్యనారాయణ, సబ్ యూనిట్ ఆఫీసర్ నగేష్ పట్నాయక్, పలువురు ల్యాబ్ టెక్నీషియన్లు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణంపై ఫిర్యాదు

ప్రజాశక్తి-పద్మనాభం : మండలంలోని మద్ది గ్రామానికి ఆనుకొని ఉన్న జానకిరామ పౌల్ట్రీ వద్ద పౌల్ట్రీకి చెందిన భూమిలో బుధవారం రాత్రి ఎటువంటి అనుమతి లేకుండా రోడ్డు వేయడానికి ఏర్పాట్లు చేస్తున్నారని స్థానిక పోలీసులకు బాధితులు ఫిర్యాదు చేశారు. మద్ది గ్రామానికి చెందిన తెలుగుదేశం నాయకుడు తన భూములకు రోడ్డు వేసుకోవడానికి ఏర్పాట్లు చేశారని, దీనిపై తగు చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో కోళ్ల ఫారం దగ్ధం

తొమ్మిది షెడ్లు అగ్నికి ఆహుతి : రూ.ఐదు లక్షల ఆస్తినష్టం



దగ్ధమైన కోళ్లఫారం షెడ్‌లు

ప్రజాశక్తి -ఆనందపురం: మండల కేంద్రంలోని కోళ్లఫారంలో గురువారం విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో జరిగిన అగ్నిప్రమాదంలో తొమ్మిది షెడ్లు కాలి బూడిదయ్యాయి. రూ.ఐదు లక్షల ఆస్తినష్టం వాటిల్లింది.ఆనందపురంలో బేగ్ బాయిలర్ కోళ్ల ఫారం అసోసియేషన్ అధ్యక్షులు కొట్యాడ శ్రీను కోళ్ల ఫారంలో సాయంత్రం ఐదు గంటల సమయంలో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో ఒక్కసారిగా మంటలు చెల్లరేగాయి. అప్రమత్తమైన స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందిం చారు. తాళవలస అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేసారు. అప్పటికే 9షెడ్లు దగ్ధం కాగా, రూ.ఐదు లక్షల వరకు ఆస్తినష్టం జరిగిందని అగ్నిమాపక అధికారులు అంచనా వేశారు. పక్కనున్న జనావాసాలకు వ్యాపించకుండా మంటలను అదుపులోకి తేవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. విఆర్ఒ అప్పారావు ప్రమాదస్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

పింఛను భిక్ష కాదు.. హక్కు!

- పెన్షన్ రద్దుచేసే అధికారం ప్రభుత్వాలకు లేదు
- డిఫెన్స్ కోఆర్డినేషన్ కమిటీ చైర్మన్ రెడ్డి వెంకటరావు

ప్రజాశక్తి-గోపాలపట్నం : పింఛను భిక్ష కాదని, కార్మికుల హక్కు అని, దానిని రద్దుచేసే అధికారం ప్రభుత్వాలకు లేదని పెన్షనర్ల డిఫెన్స్ కోఆర్డినేషన్ కమిటీ చైర్మన్ రెడ్డి వెంకటరావు అన్నారు. పాత విధానంతో పొందుతున్న పెన్షన్‌ను రద్దు చేయాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా గురువారం కాకానినగర్ సిడిఎ నేవీ కార్యాలయం వద్ద కాన్ఫరేషన్ ఆఫ్ సెంట్రల్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ ఆధ్వర్యాన నిరసన చేపట్టారు.

ఈ సందర్భంగా వెంకటరావు మాట్లాడుతూ, ధరల పెరుగుదలకు అనుగుణంగా అలాగే పే కమిషన్ సందర్భంగా పెరుగుతున్న జీతభత్యాలకు అనుగుణంగా పెన్షన్ ఇవ్వాల్సిన బాధ్యత కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపైన ఉందన్నారు, పే కమిషన్ సిఫార్సుల అమలులో పాతవారికి పెన్షన్ నిలుపుదల చేసి, కొత్తవారికి మాత్రమే పెరిగిన జీతాలకు అనుగుణంగా పెన్షన్ ఇస్తామంటే కుదరదని హెచ్చరించారు. 7వ సంఘం సిఫార్సుల అమలు తరువాత దేశానికి ఆదర్శంగా ఉండాల్సిన ఎంపిలు రెండు సార్లు జీతాలు పెంచుకున్నారని గుర్తుచేశారు, ఉద్యోగులకు ఎందుకు పెంచటం లేదని ప్రశ్నించారు. 2004 తరువాత ఉద్యోగంలో చేరిన వారికి పాత పెన్షన్ విధానం అమలు చేయకుండా, యుపిఎస్‌ను తెచ్చి రుద్దడం భావ్యం కాదని దుయ్యబట్టారు.

కేంద్రం తీసుకొచ్చిన మార్పులతో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులతో పాటు నేడు పెన్షన్ పొందుతున్న ఇన్సూరెన్స్, బ్యాంక్ పెన్షనర్లు అందరికి వర్తింపజేస్తారని,


ఆందోళనలో పాల్గొన్న పెన్షన్‌దారులు


పెన్షనర్ల నిరసనలో మాట్లాడుతున్న రెడ్డి వెంకటరావు

దీనివలన పెన్షన్‌దారులందరూ తీవ్రంగా నష్టపోతారని వివరించారు. పెన్షన్ విధానంలో కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న మార్పులకు వ్యతిరేకంగా. దేశవ్యాప్తంగా అన్ని రంగాల పెన్షనర్లు, పెన్షనర్ల అసోసియేషన్లు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు నాయకత్వం వహిస్తున్న ఫెడరేషన్లు, ట్రేడ్ యూనియన్లును కలుపుకొని ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. అనంతరం కెవి రామకృష్ణ ఆధ్వర్యాన వివిధ అసోసియేషన్ల ప్రతినిధులు సిడిఎ నేవీ అడ్మిన్ ఆఫీసర్‌ను కలిసి ప్రధాన మంత్రి పేరిట వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎస్.జ్యోతీశ్వరరావు, ఆప్రా నాయకులు కె.సుధాకర్, బాపూజీ, జిఎస్ ఎన్ రాజు, సత్యరావు, లచ్చిరాజు, ఎమ్ఆర్‌డి రాజు హరిప్రసాద్, రవిబాబు, నాగేశ్వరరావు, అరుణ్‌కుమార్, సునీల్ వందలాది కార్మికులు పాల్గొన్నారు.

గోస్తనీలోని ఊటబావుల శుభ్రత

- గంధవరంలో కుళాయిల్లో మురుగునీరుపై ఆర్‌డబ్ల్యుఎస్ అధికారుల చర్యలు
- 'ప్రజాశక్తి' కథనానికి స్పందన


ఊటబావులను శుభ్రం చేస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి-పద్మనాభం : మండలంలోని గంధవరం గ్రామంలో కుళాయిల్లో మురుగు నీటి సమస్యపై మండల తాగునీటి సరఫరా విభాగం అధికారులు స్పందించారు. గురువారం 'కుళాయిల్లో మురుగు నీరు' శీర్షికతో ప్రజాశక్తిలో వచ్చిన కథనంపై ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇఇ హరీష్ స్పందించారు. పద్మనాభం పంచాయతీ పరిధిలో ఉన్న ఇసుకలపాలెం వద్ద గోస్తనీ నదిలో ఉన్న మూడు ఊట బావుల్లో నీటి మట్టాలు తగ్గడం, వ్యర్థాలు పేరుకుపోవడం వల్లే గంధవరంలో కుళాయి పైపులైన్లలో మురుగునీరు వస్తున్నట్లు గుర్తించామని, గోస్తనీ నదిలోని మూడు ఊటబావులను గురువారం నుంచి శుభ్రం చేస్తున్నామన్నారు. గోస్తనీ నదిలో గతంలో ఏర్పాటు చేసిన బావి మురుగు పట్టి, మోటార్ల ద్వారా నీరు సరఫరా కూడా తగ్గిపోవడంతో నదిలో ఉన్న బావులను పరిశీలించామని, వాటిల్లోనూ నీటిమట్టాలు తక్కువగా ఉండడంతో సుమారు 20 అడుగుల లోతులో ఉన్న బావిలోకి దిగి వాటిని శుభ్రం చేస్తున్నామన్నారు. ఈ పనులు పూర్తయ్యేంతవరకు కుళాయి పైపులైన్ ద్వారా మురుగునీరు వస్తుందని, ఆ నీటిని ఎవరూ వాడరాదని సూచించారు. పని పూర్తయిన తర్వాత మునుపటి లా స్వచ్ఛమైన నీరు వస్తుందని ఎఇఇ సురేష్ తెలిపారు.

ఎన్‌ఎడి 'నారాయణ' విద్యార్థుల ప్రతిభ


ప్రతిభ చూపిన విద్యార్థులతో పాఠశాల యాజమాన్య ప్రతినిధులు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : నాసా రీసెర్చ్ విభాగంలో ఎన్‌ఎడి నారాయణ పాఠశాల విద్యార్థులు ఆయుష్ ప్రాజెక్టులో ప్రపంచ స్థాయిలో బహుమతులు సాధించారని పాఠశాల ప్రిన్సిపల్ ఎన్ ధనలక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధ్యాయుల సహకారం, విద్యార్థుల కృషి పట్టుదలతో, అత్యుత్తమ ప్రతిభను కనబరిచి ఇటువంటి అరుదైన ఘనతను తమ పాఠశాల విద్యార్థులు సాధించారని హర్షం వ్యక్తం చేశారు.బహుమతులు సాధించిన విద్యార్థులు తంగేటి బాల ఆదిత్య, ఆదిరెడ్డి నిహాల్ నాయుడు,నర్సిమల్లి జాయ్ చెర్రీ, ఇయ్యపు యువల్, ధనుష్, ధరనేశ్వర్, కుశాల్ సాయి, యోగేంద్రలను అభినందించారు విద్యార్థులను ఏజిఎం రాజ్ కుమార్, హైస్కూల్ కోఆర్డినేటర్ శ్రీరామ్‌నరేష్, ప్రతాప్, ఇన్‌ఛార్జి సుభాని అభినందించి, శుభాకాంక్షలు తెలిపారు.

మహిళలకు ఉపాధి అవకాశాలపై శిక్షణ

ప్రజాశక్తి-పద్మనాభం : డ్వాక్రా, స్వయంశక్తి సంఘాల సభ్యులకు ఆర్థికస్వావలంబన చర్యల్లో భాగంగా స్వయం ఉపాధి శిక్షణ ఇవ్వనున్నట్లు డిఆర్‌డిఎ ఏరియా కోఆర్డినేటర్ సత్యనారాయుడు డిఆర్‌డిఎ ఐబి ఎపిఎం ప్రభాకర్. ఎపిఎం సాయి రమేష్ అన్నారు గురువారం మండల కాంప్లెక్స్‌లోని వెలుగు కార్యాలయంలో ఎన్యూమరేటర్లకు డిఆర్‌డిఎ ఆధ్వర్యంలో నాలుగు రోజులుగా శిక్షణనిస్తున్నారు.

ఈసందర్భంగా మాట్లాడుతూ, మండలంలోని ఎంపిక చేసిన వివిధ గ్రామాల గ్రామ సంఘ సభ్యులకు 2003 మందికి ఈనెల 6 నుంచి శిక్షణ పొందిన ఎన్యూమరేటర్లు గ్రామస్థాయిలో సర్వే నిర్వహించి, అవగాహన కల్పిస్తారన్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో ఆయా గ్రామసంఘాల సభ్యుల ఆర్థిక పురోగతి ఎలా పెంపొందించుకోవాలి, వాటి అవసరాలు ఎలా తీర్చుకోవాలి అనే అంశాలపై సర్వే చేపట్టి, వివిధ బ్యాంకుల ద్వారా సిఐఎఫ్, శ్రీనిధి బ్యాంకు లింకేజీ, అంతర్గత రుణాలు పొంది, వాటిని సద్వినియోగం చేసుకోవడం ద్వారా ఆర్థికాభివృద్ధి సాధించడంపై అవగాహన కల్పిస్తారన్నారు.

అమెజాన్ ఫ్యూచర్ ఇంజనీర్ హ్యాక్‌థాన్‌లో కెజిబివి విద్యార్థినుల ప్రతిభ


సాధించిన బహుమతులతో విద్యార్థినులు, టీచర్లు

ప్రజాశక్తి -ఆనందపురం : రాష్ట్రస్థాయిలో కంప్యూటర్ కోడింగ్ నైపుణ్యాలు నేర్పించే అమెజాన్ ఫ్యూచర్ ఇంజనీర్ హ్యాక్‌థాన్‌లో స్థానిక కెజిబివి విద్యార్థినులు మంచి ప్రతిభ కనబరిచారు. విశాఖపట్నం హోటల్ గ్రీన్ పార్క్‌లో జరిగిన కార్యక్రమంలో విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల నుంచి 27 మంది విద్యార్థులు పాల్గొనగా, స్థానిక కస్తూర్బా పాఠశాల ఎనిమిదవ తరగతి విద్యార్థినులు ఎల్ శకుంతల, బి లేఖ్య , ఎల్ శశికళ సత్తాచాటి, రాష్ట్ర స్థాయిలో రెండవ బహుమతిని గెలుచుకున్నారు. పాఠశాల గణిత ఉపాధ్యాయిని హైమావతి హ్యాక్‌థాన్ కోర్స్‌పై నవంబర్ నెల నుంచి విద్యార్థులకు తర్ఫీదు నివ్వడంతోపాటు వివిధ సమస్యలకు కోడింగ్ ద్వారా యానిమేషన్ రూపంలో విద్యార్థులు పరిష్కారాలను వివరించారు ఈ ప్రాజెక్టుకు ప్రిన్సిపల్ లావణ్య పూర్తి సహాయ సహకారాలు, ప్రోత్సాహాన్ని అందించారు. హ్యాక్‌థాన్ పోటీల్లో రాష్ట్రస్థాయిలో రెండవ స్థానంలో నిలిచిన కస్తూర్బా విద్యార్థినులు, ఉపాధ్యాయులను అమెజాన్ ఫ్యూచర్ ఇంజనీర్ సంస్థ ప్రతినిధులు అభినందించి, పాఠశాలకు ఒక టీవీ, రెండు ల్యాప్ టాప్‌లు, రెండు ట్యాబ్స్‌తోపాటు ప్రతిభ చూపిన విద్యార్థినులకు షీల్డ్, ప్రశంసాపత్రాలను అందజేశారు. వేస్ట్ టు హెల్త్ అనే ప్రాజెక్టుకు రాష్ట్రస్థాయిలో రెండో బహుమతి పొందిన విద్యార్థినులను సమగ్ర శిక్ష ఎపిసి డాక్టర్ జె.చంద్ర శేఖర్, జిసిడిఒ డాక్టర్ ఖలేషా బేగం అభినందించారు.

విశాఖ పోర్టు ఆసుపత్రిని ప్రైవేటుపరం చేయొద్దు


మాట్లాడుతున్న పద్మనాభరాజు

ప్రజాశక్తి -మాధవధార : విశాఖ పోర్టు గోల్డెన్ జూబ్లీ హాస్పిటల్‌ను ప్రైవేటుకు ధారాదత్తం చేయొద్దని డిమాండ్ చేస్తూ యునైటెడ్ పోర్ట్ అండ్ డాక్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు వివిఎస్ పద్మనాభరాజు, ప్రధాన కార్యదర్శి కె సత్యనారాయణ డిమాండ్ చేశారు. గురువారం కంచరపాలెం మెట్టు వద్ద యూనియన్ ఆధ్వర్యంలో ప్లకార్డులతో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా పద్మనాభరాజు మాట్లాడుతూ పిపిపి పద్ధతిలో పోర్టు ఆసుపత్రి ప్రయివేటీకరణకు విశాఖపట్నం పోర్టు యాజమాన్యం టెండరింగ్‌కు ఆహ్వానించడం దుర్మార్గమన్నారు. పోర్టు ఉద్యోగులు, కార్మికులు, పెన్షనర్లతోపాటు వారి కుటుంబీకుల ఆరోగ్యం ప్రమాదాన పడే ఛాన్స్ ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. పోర్టు నిధులతోనే ఆసుపత్రిని అభివృద్ధి చేయాలని, వైద్యులు, సిబ్బంది నియామకంతోపాటు, నాణ్యమైన మందులను అందుబాటులో ఉంచి సేవలను మెరుగుపరచాలని కోరారు. కార్యక్రమంలో రాజు, సోమేశు, సూర్యారావు, ఒమ్మి అప్పారావు, ఈశ్వరరావు పాల్గొన్నారు.

బాలికల హాస్టల్‌లో అదనపు సౌకర్యాలు

- రూ.79 లక్షల దివీస్ సిఎస్ఆర్ నిధులతో ఏర్పాటు : ప్రారంభించిన జిల్లా కలెక్టర్


సౌకర్యాలను ప్రారంభిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

ప్రజాశక్తి-తగరపువలస : కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా భీమిలి మండలం, చిప్పాడ దివీస్ సమకూర్చిన రూ.79లక్షల సిఎస్ఆర్ నిధులతో చిట్టివలస సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహంలో కల్పించిన అదనపు సౌకర్యాలను గురువారం సంస్థ ప్రతినిధులతో కలిసి జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ అందుబాటులోకి తెచ్చారు .దివీస్ నిధులతో ఆధునిక వసతులతో కూడిన తరగతి గదులు, సాంకేతిక పరికరాలు, ఆర్ఓ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వంతో పాటు దివీస్‌వంటి సంస్థలు సామాజిక బాధ్యతగా అందిస్తున్న సౌకర్యాలను అందిపుచ్చుకుని బాగా చదువుకోవాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం హాస్టల్ ఆవరణలో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో దివీస్ సంస్థ జిఎం వైఎస్ కోటేశ్వరరావు, సాంఘిక సంక్షేమ శాఖ డిడి, రామారావు, ఎఎస్‌డబ్ల్యుఒ జి రమాదేవి, వసతిగృహ సంక్షేమాధికారులు మోహిని, ఆనందరావు, పర్యవేక్షకులు ప్రవీణ్, దివీస్ ప్రతినిధులు వరహాలరెడ్డి, సిఎస్ఆర్ మేనేజర్ డి సురేష్‌కుమార్ పాల్గొన్నారు

పలు సేవా కార్యక్రమాలతో మాజీ జెడి పుట్టినరోజు వేడుక

ప్రజాశక్తి -భీమునిపట్నం: జెడి ఫౌండేషన్ వ్యవస్థాపకులు, సిబిఐ మాజీ జాయింట్ డైరెక్టర్ వివి లక్ష్మీనారాయణ పుట్టిన రోజు సందర్భంగా గురువారం పలు సేవా కార్యక్రమాలను నిర్వహించారు. జివిఎంసి నాలుగో వార్డు బీచ్ రోడ్డు, తొట్లకొండ సమీపంలోని చిన జీయర్ స్వామి ఆశ్రమంలో అంధులైన చిన్నారులకు అన్నదానం చేశారు నరసింహనగర్ రాయల్ విల్లాలో రమేష్ బాబు, బొత్స సురేష్ ఆధ్వర్యంలో రక్త దాన శిబిరం నిర్వహించారు. జెడి ఫౌండేషన్ ఉత్తరాంధ్ర కన్వీనర్ కె అను, సభ్యులు బి కృష్ణ మోహన్, ఎల్ పెదబాబు, పి నాగేశ్వరరావు పాల్గొన్నారు


రక్తదానం చేస్తున్న నిర్వాహకులు

వృద్ధాశ్రమ సందర్శన

ప్రజాశక్తి -ఆనందపురం: గంభీరం వద్ద స్నేహసంధ్య ఏజ్ కేర్ వృద్ధుల ఆశ్రమాన్ని విఎంఆర్‌డిఎ చైర్మన్ ఎంవి ప్రణవ్ గోపాల్ గురువారం ఉదయం జాయింట్ కమిషనర్ కె రమేష్‌తో కలిసి సందర్శించారు. సంస్థ ప్రత్యేకతలను ఆశ్రమ నిర్వాహకులు నరేష్ కుమార్, సాంబశివరావు గురించి వివరించారు. సుమారు 90 ఇన్ పేషెంట్స్, 150 బెడ్ల సామర్థ్యం కలిగి, వృద్ధులకు అందించే సేవలు, వసతి, వైద్యం, భోజనం వంటి అంశాలు వివరించారు.. భవన నిర్మాణ అనుమతులు గురించి వివరించారు. దీనిపై స్పందించిన విఎంఆర్‌డిఎ చైర్మన్ ఎంవి ప్రణవ్ గోపాల్ మాట్లాడుతూ ఆశ్రమంలోని వృద్ధులకు వయస్సురీత్యా వచ్చే సమస్యలపై ఆధునిక చికిత్సతోపాటు వసతి కల్పించడం అభినందనీయమన్నారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

ప్రజాశక్తి-మధురవాడ :మారికవలస సబ్ స్టేషన్ పరిధిలో నిర్వహణ, మరమ్మతుల దృష్ట్యా ఈనెల 4న శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని మూడవ జోన్ ఎపిఇపిడిసిఎల్ ఆపరేషన్స్ విభాగం ఇఇ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. మారికవలస జంక్షన్, జెఎన్ఎన్‌యుఆర్ఎం కాలనీ, శారదానగర్ కాలనీ, పిఎం పాలెం, మారికవలస గ్రామం, బోరవాని పాలెం, బోరవానిపాలెం డ్రైవర్స్ కాలనీ, జెకె లేఅవుట్,కొత్త పరదేశిపాలెం, పాత పరదేశిపాలెం ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ప్రతి కుటుంబానికీ రక్షిత మంచినీరు

- ఉపాధి హామీ కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించాలి
- జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్



మాట్లాడుతున్న కలెక్టర్ విజయ కృష్ణన్

ప్రజాశక్తి-అనకాపల్లి

ఉపాధి హామీ అధికారులు, గ్రామీణ నీటి సరఫరా అధికారులు, విద్యుత్ శాఖ అధికారులు వేసవిలో ఉపాధి, మంచినీరు, విద్యుత్ అంశాలలో ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్ తెలిపారు. కలెక్టరు కార్యాలయంలో గురువారం జిల్లా అధికారులు, ఎంపిడిఒలు, గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా చేపడుతున్న సర్వేలు, ఎస్‌డబ్ల్యుపిసి షెడ్లు, హౌసింగు, గ్రామీణ నీటి సరఫరా, ఉపాధిహామీ, చలివేంద్రాలు ఏర్పాటు అంశాలపై జిల్లా కలెక్టరు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ సచివాలయాల సిబ్బంది నూరుశాతం హాజరు నమోదుకావాలన్నారు. విధులలో నిర్లక్ష్యం వహించే సచివాలయ సిబ్బందిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. పుట్టిన ప్రతి చిన్నారికి ఆధార్ కార్డు అందజేయాలని, పిఎస్ఎస్ ఇకెవైసీ పూర్తిచేయాలని కోరారు. ఉపాధికూలీలకు మంచినీరు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాలలో పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. వేసవిలో మంచినీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని గ్రామీణ నీటి సరఫరా అధికారులను జిల్లా కలెక్టరు ఆదేశించారు. మంచినీటి సరఫరాలో ఇబ్బందులు వస్తే వెంటనే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలన్నారు. జిల్లాలో 500 పశువుల నీటి తొట్టెలను మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. జిల్లాలో జూన్ నాటికి 7200 ఇండ్లను పూర్తిచేయాన్నారు. వేసవి దప్పిక ప్రజల దాహార్తిని తీర్చేందుకు అవసరమైన చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పి సిఇఒ పి.నారాయణమూర్తి, హౌసింగు ప్రోజెక్టు డైరెక్టరు వై.శ్రీనివాసరావు, గ్రామీణ నీటిసరఫరా జిల్లా ఇంజనీరింగు అధికారి ఎ.ఎస్.ఎ.రామస్వామి, జిల్లా పంచాయతీ అధికారి పి.శిరీషారాణి, డిపిఆర్సి జిల్లా కోర్డినేటరు ఇ.నాగలక్ష్మి, ఎంపిడిఒ, ఇ ఒ ఆర్ డి లు, మండల ఇంజనీర్లు పాల్గొన్నారు.

మోడల్ గ్రామాల్లో సోలారు యూనిట్లు

అనకాపల్లి : జిల్లాలో పిఎం. సూర్యఘర్ పథకం కింద మోడల్ గ్రామాలుగా ఎంపికచేసిన అయిదు గ్రామాలలో ప్రతి ఇంటికి సోలారు యూనిట్ ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్ తెలిపారు. కలెక్టరు కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం మోడల్ గ్రామాలుగా గుర్తించిన కశింకోట మండలం బయ్యవరం, సబ్బవరం మండలం గుల్లేపల్లి, మునగపాక మండలం తోటాడ, ఎస్.రాయవరం మండలం గుడివాడ, గొలుగొండ మండలం గొలుగొండ గ్రామాలలో పిఎం సూర్యఘర్ పథకం అమలు పురోగతిని గురువారం సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సోలారు యూనిట్ ఏర్పాటుకు ఉచిత దరఖాస్తుతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సబ్సిడీ, బ్యాంకు రుణం మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ సిఇఒ పి.నారాయణమూర్తి, ఎపిఇపిడిసిఎల్ ఎస్ఇ జి.ప్రసాద్, జిల్లా పంచాయతీ అధికారి పి. శిరీషారాణి, లీడ్ బ్యాంకు మేనేజరు కె.సత్యనారాయణ, డిఆర్డిఎ పి.డి. కె.శచీదేవి, ఆయా మండలాల ఎంపిడిఒలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

క్రీడల అభివృద్ధిపై సమావేశం

అనకాపల్లి : ప్రతి మండల ప్రధాన కేంద్రల్లో వాలీబాల్ కోర్ట్ ఏర్పాటు చెయ్యాలని జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ సంబంధిత అధికారులు ఆదేశించారు. కలెక్టరేట్ మినీ కన్వరన్స్ హాల్లో గురువారం జిల్లా స్థాయి జిల్లా క్రీడల అభివృద్ధి కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం జాహ్నవి, జిల్లా రెవిన్యూ అధికారి వై సత్యనారాయణ రావు, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి ఎల్ వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతిభ ఉన్న క్రీడాకారులకు సరైన ప్రోత్సాహం లభిస్తే అద్భుతంగా రాణిస్తారన్నారు. క్రీడల్లో రాణిస్తే యువతకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. ఈ సమావేశంలో జెడ్‌పి సిఇఒ నారాయణ మూర్తి, డిపిఒ శిరీషా రాణి, పంచాయతీ రాజ్ ఈఈ వీరం నాయుడు, ఎపిఐఐసి ప్రాజెక్ట్ ఇంజనీర్ సత్యం రాజు, సమగ్ర శిక్ష ఎపిసి నరసింహ మూర్తి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

3వ రోజుకు క్వారీ కార్మికుల సమ్మె

ప్రజాశక్తి-అనకాపల్లి : క్వారీ డ్రిల్లింగ్ బ్లాస్టింగ్ కార్మికుల సమస్యలు పరిష్కారం చేయాలని కోరుతూ చేపట్టిన సమ్మె గురువారం మూడో రోజుకు చేరింది. కార్మికుల సమ్మెకు సంఘీభావంగా ఏఐఎఫ్టియు (న్యూ) రాష్ట్ర అధ్యక్షులు గణేష్ పండా మాట్లాడారు. కార్మికులు తమ రక్తాన్ని చెమట చుక్కలుగా చిందించి, ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని మరీ కొండలను కరిగించి యజమానులకు కోట్లాది రూపాయలు లాభాలు సంపాదించి పెడుతున్నా కార్మికులకు కూలీ రేట్లు, జీతాలు పెంచకపోవడం అన్యాయమన్నారు. ప్రజలు, కార్మికుల ఓట్లుతో ప్రజాప్రతినిధులుగా ఎన్నికైన వారు కార్మికులు చేస్తున్న పోరాటానికి మద్దతు తెలపడం లేదంటేనే వారు యాజమాన్యాలకు కొమ్ము కాస్తున్నారని అర్థమవుతుందన్నారు. కార్మికులు సంఘటితంగా పోరాడితే ఎవరైనా దిగి రావాల్సిందేనని స్పష్టం చేశారు. కార్యక్రమంలో క్వారీ కార్మిక సంఘం నాయకులు శానాపతి అప్పలనాయుడు, చింతల రమేష్, ఏ.అప్పలనాయుడు, లింగ, సిహెచ్ చిన్నారావు, చవితిన నూకరాజు, గొర్రపల్లి తాతబాబు పాల్గొన్నారు.

కాటపల్లికి ఆత్మీయ సత్కారం

ప్రజాశక్తి-దేవరాపల్లి : ఉగాది సందర్భంగా అంబేద్కర్ సేవా రత్న అవార్డు అందుకున్న దేవరాపల్లికి చెందిన కాటపల్లి అప్పారావును టిడిపి ఎస్సీ సెల్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి చింతా సాంబమూర్తి, తెలుగు రైతు ఆర్గనైజింగ్ కార్యదర్శి కడిమి నాగేశ్వరరావు, మండల గిరిజన సంఘం నాయకులు శెట్టి మంగరాజు గురువారం సత్కరించారు. దళిత, బహుజన ఉద్యమాన్ని, హక్కులను కాపాడే విధంగా మరింత కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ పాల సంఘం అధ్యక్షుడు విదడల సత్యారావు, స్థానిక దళిత నాయకులు కంచిమాల అప్పారావు, సబ్బవరపు కొండలరావు, ఉల్లి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నూకాంబికను దర్శించుకున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి-అనకాపల్లి రూరల్ : అనకాపల్లి శ్రీనూకాంబిక అమ్మవారిని గురువారం ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ మర్యాదలతో కమిటీ సభ్యులు స్వాగతం పలికి ఘనంగా సత్కరించి అమ్మవారి చిత్రపటాన్ని ప్రసాదాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ పీలా నాగ శ్రీను, ఆలయ ఈవో వెంపలి రాంబాబు, రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మల్ల సురేంద్ర, ఆలయ మాజీ చైర్మన్ బిఎస్ఎంకె జోగినాయుడు, ఆలయ ధర్మకర్తలు సూరే సతీష్, దాడి రవికుమార్, పొలిమేర ఆనంద్, మారిశెట్టి శంకర్రావు, కాండ్రేగుల రాజారావు, మజ్జి శ్రీనివాసరావు, కొడుకుల శ్రీకాంత్, వడ్డాది మంగ, కోనేటి సూర్యలక్ష్మి ఎర్రవరపు లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి-అనకాపల్లి : 33/11కేవీ సబ్ స్టేషన్ చెట్టు కొమ్మలు నరకడం కారణంగా తుమ్మపాల సెక్షన్ పరిధిలోని తుమ్మపాల వాటర్ వర్క్స్ సబ్ స్టేషన్స్ పరిధిలో ఉన్న గ్రామాలకు ఈనెల 4 తేదీ ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని, వినియోగదారులు సహరించాలని కసింకోట ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్ రామకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

రుణాల ఇంటర్వ్యూలకు స్పందన

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని బీసీ కార్పొరేషన్ రుణాలకు 892 మంది దరఖాస్తు చేసుకోగా 740 మంది లబ్దిదారులు ఇంటర్వ్యూలకు హాజరైనట్లు ఎంపీడీవో పి.పద్మజ తెలిపారు. ఈ రుణాలకు సంబంధించి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ ఇండియా, గ్రామీణ బ్యాంకు, సెంట్రల్ బ్యాంకు, కెనరా బ్యాంకు, యూనియన్ బ్యాంకులకు చెందిన బ్యాంకర్లు పాల్గొని అభ్యర్థులను ఇంటర్వ్యూ చేసి దరఖాస్తులు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏవో కె.శివ నారాయణ ప్రసాద్, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

చోడవరం : బీసీ కార్పొరేషన్ రుణాల దరఖాస్తుదారులకు గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో లబ్ధిదారులు హాజరయ్యారు. మొదటి విడతగా మండలంలో 14 పంచాయతీలకు గురువారం ఇంటర్వ్యూలో నిర్వహించారు. మిగతా 18 పంచాయతీలకు శుక్రవారం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో వివిధ బ్యాంక్ అధికారులతో పాటు ఎంపీడీవో ఆంజనేయులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కశింకోట : కశింకోటలో వివిధ కార్పొరేషన్ రుణాలు కోసం గురువారం ఇంటర్వ్యూలు నిర్వహించగా 512 మంది హాజరయ్యారు. బిసిల నుండి 496 మంది, కాపు నలుగురు, బ్రాహ్మణ ముగ్గురు, వైశ్య 9 మంది హాజరయ్యారు. ఈ కార్యక్రమలో ఎంపిడిఓ రవి కుమార్, వివిధ బ్యాంకుల అధికారులు పాల్గొన్నారు.

నిర్వాసితులకు న్యాయం చేయాలని కరపత్ర ప్రచారం

ప్రజాశక్తి-అచ్యుతాపురం : అచ్యుతాపురం -అనకాపల్లి రహదారి విస్తరణ బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యంలో కరపత్రం ప్రచారం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం అచ్యుతాపురం మంగల కన్వీనర్ ఆర్.రాము మాట్లాడుతూ నిర్వాసితులకు టిడిఆర్ బాండ్లు వద్దని, నగదు రూపంలో పరిహారం చెల్లించాలని కోరారు. 2013 చట్టం ప్రకారం నిర్వాసితులకు స్థలాల కేటాయించి పునరావాసం కల్పించాలని డిమాండ్ చేశారు.

అంబులెన్స్ కోసం రూ.35 లక్షల చెక్కు అందజేత

ప్రజాశక్తి-అనకాపల్లి : అధునాతన ప్రాణ సంరక్షణ అంబులెన్స్ ఏర్పాటు కోసం రూ.,35 లక్షల చెక్కును ఎన్టిపిసి సింహాద్రి ప్రతినిధులు గురువారం జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్‌కు అందజేశారు. ఎన్‌టిపిసి సింహాద్రి తన కార్పొరేట్ సామాజి బాధ్యత కింద అనకాపల్లి జిల్లాలోని నర్సీపట్నం ప్రభుత్వ ఆసుపత్రికి అధునాతన లైఫ్ సేవింగ్ అంబులెన్స్ కోసం ఈ నిధులు ఖర్చు చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్‌టిపిసి ఇడది సమీర్ శర్మ, ప్రతినిధులు ప్రస్సెంజిత్ పాల్, బి.బి.పాత్ర, హెచ్ఒహెచ్ఆర్ కె. ప్రకాశరావు, మేనేజర్ పాల్గొన్నారు.

12న విశాఖలో విద్యుత్ ఉద్యోగుల సదస్సు



పోస్టర్, కరపత్రాలను ఆవిష్కరిస్తున్న యూనియన్ నాయకులు

ప్రజాశక్తి-అనకాపల్లి

యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఈనెల 12న విశాఖపట్నంలో విద్యుత్ ఉద్యోగుల సదస్సు జరుగుతుందని యూనియన్ జిల్లా అధ్యక్షులు ప్రేమ చంద్రశేఖర్, డివిజన్ కార్యదర్శి పి శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు గురువారం సదస్సు గోడ పత్రికను గవరపాలెం సబ్ స్టేషన్ వద్ద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికుల సమస్యల పరిష్కారానికై, విద్యుత్ రంగంలో వివిధ విభాగాలలో తీసుకువస్తున్న ప్రైవేటీకరణ విధానాలకు వ్యతిరేకంగా ఇపిడిసిఎల్ పరిధిలో విశాఖ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఈ సదస్సు జరుగుతుందని చెప్పారు. ట్రాన్స్‌కో, జెన్కో, డిస్కంలలో పనిచేస్తున్న విద్యుత్ ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని, పిఆర్‌సి ఇవ్వాలని, కనీసం డిఎ యాడ్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేంద్ర బిజెపి ప్రభుత్వం తీసుకొచ్చిన విద్యుత్ సంస్కరణ చట్టాన్ని మన రాష్ట్రంలో గతంలో వైసిపి ప్రభుత్వం, నేడు టిడిపి కూటమి ప్రభుత్వం అమలు చేయడం దారుణమన్నారు. అదానీ, అంబానీ వంటి కార్పొరేట్ శక్తులకు విద్యుత్ రంగాన్ని కట్టబెట్టాలని చూస్తున్నారని ఆరోపించారు. విద్యుత్ రంగాన్ని అదానీ, అంబానీల వంటి కార్పొరేట్ శక్తుల కబంధ హస్తాల నుండి రక్షించుకోవడానికి, ప్రైవేటీకరణ విధానాలను తిప్పి కొట్టడానికి, కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులరైజ్ చేయడానికి ఉద్యోగ కార్మికులు ఐక్యంగా కదలాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్.డి.అప్పారావు, జాయింట్ సెక్రెటరీ ఎం.రామకృష్ణ, వైస్ ప్రెసిడెంట్ కె.జైరాజ్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శంకర్రావు పాల్గొన్నారు.

విశాఖకు డైరెక్ట్ మంత్లీ పాసులు జారీ చేయాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి నుంచి విశాఖపట్నానికి డైరెక్ట్‌గా నెలసరి ఆర్టీసీ పాసులు మంజూరు చేయాలని కోరుతూ గురువారం ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో అనకాపల్లి ఆర్‌టిసి డిపో అధికారులకు వినతిపత్రం అందజేశారు. అనకాపల్లి జీవీఎంసీలో విలీనమై దశాబ్దాలు గడుస్తున్న నేటికీ డైరెక్ట్‌గా పాసులు అనకాపల్లి నుంచి ఇవ్వకపోవడం శోచనీయమన్నారు. దీనివల్ల ఎంతోమంది కార్మికులు, ఉద్యోగులు నష్టపోతున్నారన్నారు. కార్యక్రమంలో బొడ్డేడ అప్పారావు,డాక్టర్ బొట్టా చిన్నియాదవ్, కొల్లి చిన్న అప్పారావు, బొబ్బిలి గోవిందరాజులు, వాసుపల్లి తాతయ్యలు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులు ప్రారంభం

ప్రజాశక్తి-అచ్యుతాపురం : మండలంలోని మడుతూరు, ఆవరాజాం, ఉప్పవరం గ్రామాలలో గురువారం ఉపాధి హామీ పనులను ప్రారంభించారు. మడుతురు గ్రామంలో జనసేన పార్టీ మహిళా ప్రతినిధి ఎం శ్రీవేణి, ఆవరాజాంలో సర్పంచ్ వియ్యపు నానాజీ, ఉప్పవరంలో ఉపసర్పంచ్ కూనిశెట్టి సత్తిబాబు చేతుల మీదుగా ఈ పనులు ప్రారంభించారు. ఉపాధి హామీ పనులతో సామాన్య ప్రజానీకానికి ఆర్థికంగా చేదోడుగా ఉంటుందని వారు చెప్పారు.

పైపులైన్లకు మరమ్మతులు చేపట్టరూ...

ప్రజాశక్తి-అనకాపల్లి : తుమ్మపాల నుంచి మామూరు, మాకవరం, అగ్రహారం వెళ్లే మూడు రోడ్ల జంక్షన్ వద్ద ప్రధాన రహదారిపై గత వారం రోజులుగా తాగునీరు వృధాగా పోతుందని, అక్కడ పైపు లైన్లకు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. మెగా వాటర్ ప్లాంట్ పైపులైన్ లీక్‌తో నీరు పోతుందని, ఆర్డబ్ల్యూఎస్ అధికారులకు సమస్యను ఆయా గ్రామాల ప్రజలు తెలియజేసినా కనీసం పట్టించుకోలేదని వారు ఆరోపిస్తున్నారు. ప్రజలు తాగునీరు లేకుండా ఇబ్బందులు పడుతుంటే వారం రోజులుగా తాగునీరు వృధాగా పోతున్నా పట్టించుకోకపోవడం శోచనీయం. క్వారీ క్రషర్ లారీలు అధిక బరువుతో తిరగడం వలన పైపులైన్లు పూర్తిగా దెబ్బతిన్నాయని, అందువల్లనే తాగునీరు పోతుందని, మరమ్మతులు చేసేటప్పుడు సమస్య పునరావృతం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.



తాగునీటి పైపులైన్ లీకై వృధాగా పోతున్న నీరు రోడ్డుపై నిల్వ ఉన్న దృశ్యం

సిసి రోడ్డు నిర్మాణానికి భూమి పూజ

ప్రజాశక్తి-మునగపాక : మండలంలోని మూలపేట గ్రామపంచాయతీ శివారు గంగాదేవి పేట గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణానికి సర్పంచ్ భీశెట్టి గంగ అప్పలనాయుడు గురువారం భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. 15వ ఆర్థిక సంఘం నిధులలో సుమారు రూ. 1,50 వేలతో ఈ పనులు చేపట్టినట్టు సర్పంచ్ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కాండ్రేగుల వెంకటలక్ష్మి, జేఈ గులాబ్, పంచాయతీ సెక్రటరీ మొల్లేటి గంగాధర్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ రాము, ఉపసర్పంచ్ మొల్లేటి దేవి చంద్ర, వార్డు మెంబర్లు వాకపల్లి నూకాలమ్మ, ఆడారి సత్యనారాయణ, మొల్లేటి గోవిందరావు, కాండ్రేగుల వరలక్ష్మి శ్రీనివాసరావు, భాస్కరరావు, పాల్గొన్నారు.

పోలేపల్లి సర్పంచ్ టిడిపిలో చేరిక

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండలంలో వైసీపీకి షాక్ తగిలింది. ఆ పార్టీకి చెందిన పోలేపల్లి సర్పంచ్ సీతా పైడినాయుడు టిడిపిలో చేరారు. గురువారం బుచ్చియ్యపేటలో జరిగిన టిడిపి కార్యకర్తలు సమావేశంలో ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్ రాజు సమక్షంలో సర్పంచ్, తన అనుచరులు 100 మందితో కలిసి తెలుగుదేశంలో చేరారు. వీరికి ఎమ్మెల్యే కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. కూటమి ప్రభుత్వంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను చూసే తాము పార్టీ మారినట్టు సర్పంచ్ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ డి.నాగేశ్వరీ దేవి, విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, మండల టిడిపి అధ్యక్షుడు జి కోటేశ్వరరావు, వడ్డాది టౌన్ టిడిపి అధ్యక్షుడు దొండా నరేష్, తదితరులు పాల్గొన్నారు.

అసత్య ఆరోపణలపై పోలీసులకు ఫిర్యాదు

ప్రజాశక్తి-కశింకోట : పాస్టర్ ప్రవీణ్ పగడాల చనిపోయిన ఘటనపై జీవి.హర్ష కుమార్, కెఏ.పాల్, పాస్టర్ జాన్ బెన్నీ లింగం, పాస్టర్ అజయ్ బాబు అసత్య ప్రచారం చేస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని హిందూ షెడ్యూల్ కులాల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో సమితి నాయకులు బోని గణేష్, మైలపల్లి పోతురాజు, మండపల్లి శివ పాల్గొన్నారు.

వికలాంగ విద్యార్థులకు పరికరాల వితరణ

ప్రజాశక్తి-కశింకోట : కశింకోట భవిత కేంద్రంలోని వికలాంగ విద్యార్థులకు పరవాడ ఎన్‌టిపిసి సింహాద్రి కంపెనీ యాజమాన్యం సుమారు రూ.82 వేలు విలువ గల పరికరాలు సమకూర్చింది. వాటిని గురువారం కశింకోట ఎంఇఓ సురేష్ కుమార్ చేతులు మీదగా అందజేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ హెచ్ఎం సిహెచ్.రామునాయడు, భవిత కేంద్రం ఉపాధ్యాయులు రమణమ్మ, దీపా, విద్యార్థులు పాల్గొన్నారు.

షిర్డీసాయి ఆలయానికి స్టీల్ కంచాలు


ప్రజాశక్తి-దేవరాపల్లి : రైవాడలోని షిర్డీ సాయిబాబా ఆలయంలో ప్రతి గురువారం జరుగుతున్న అన్నదానానికి అవసరమైన 50 స్టీలు కంచాలను ముషిడిపల్లి గ్రామానికి చెందిన సిరపురపు పైడం నాయుడు దంపతులు, వారి అల్లుడు పరవాడకు చెందిన పైల శ్రీను, బాంధవి దంపతులు అందజేశారు. తండారపు అప్పారావు అనే దాత 25 కేజీల వంట పాత్రను అందించారు. రైవాడ గ్రామానికి చెందిన కురుమూజు ఈశ్వర్రావు, ప్రభ దంపతుల సహకారంతో స్వామి వారి ఆలయ ప్రాంగణంలో గురువారం అన్నసమారాధన జరిగింది.

డ్రెయినేజీలో పూడిక తొలగింపు

ప్రజాశక్తి-అచ్యుతాపురం : అచ్చుతాపురం నుంచి ఎలమంచిలి వైపు వెళ్లే మార్గంలో డ్రైనేజీల పూడిక తీత పనులు చేపట్టారు. డ్రైనేజీలో పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించారు. డ్రైనేజీపై వేసిన అక్రమ కట్టడాలను తొలగించి మురుగునీరు ప్రవాహానికి ఆటంకం లేకుండా చేశారు. ఈ పనులను ఈఓపిఆర్‌డి సిహెచ్.శ్రీరాములునాయుడు, గురువారం పర్యవేక్షించారు.

టిడిపి సభ్యత్వ కార్డుల పంపిణీ

ప్రజాశక్తి-అనకాపల్లి రూరల్ : అనకాపల్లి తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఎపి రాష్ట్ర అర్బన్ ఫైనల్స్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ టిడిపి సభ్యత్వ కార్డులను కార్యక్రమంలో టిడిపి 171 బూత్ ఇంచార్జ్ ఎస్.భానుచందర్ గురువారం అందజేశారు. పార్టీ నాయకులు పచ్చికూర రాము, రమేష్, పొలిమేర ఆనంద్, నాయుడు, షేక్ రియాజ్, ఆళ్ల జగదీష్ పాల్గొన్నారు.



సభ్యత్వ కార్డులు అందిస్తున్న పీలా గోవింద సత్యనారాయణ

యాప్‌ల భారంపై అంగన్వాడీల నిరసన



నినాదాలు చేస్తున్న అంగన్వాడీ కార్యకర్తలు

ప్రజాశక్తి-మునగపాక

మండలంలోని తిమ్మరాజుపేట అంగన్వాడీ కేంద్రంలో గురువారం మండలంలోని అంగన్వాడీ టీచర్లకు నిర్వహించిన శిక్షణ అనంతరం ప్రభుత్వం యాప్‌ల భారం తగ్గించాలని కోరుతూ అంగన్వాడీ టీచర్లు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అంగన్వాడీ టీచర్లు మాట్లాడుతూ అంగన్వాడి ఉద్యోగులకు పనికి తగ్గ పారితోషికం,పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనం అమలు చేయడం లేదన్నారు. పనిభారం తగ్గించాలని తాము ధర్నాలు చేస్తుంటే పట్టించుకోకుండా అనేక యాప్‌లు ద్వారా మరింత పని భారాన్ని ప్రభుత్వం పెంచుతుందని తెలిపారు. 3-6 సంవత్సరాలు లోపు పిల్లల సమగ్రాభివృద్ధికి నిర్వహిస్తున్న ప్రీ స్కూల్ కార్యక్రమాలకు ఈ యాప్‌లు ఆటంకంగా మారాయని పేర్కొన్నారు. అంగన్వాడీ పనులతోనే సతమతమవుతుంటే, ఇది చాలదన్నట్లు గ్రామాల్లో ఇచ్చే పెన్షన్‌లో కూడా తమను భాగస్వాములు చేయటం దారుణమన్నారు. ఐసిడిఎస్ లక్ష్యానికి విరుద్ధంగా ఈ యాప్‌లు పని ఉందని, ప్రశాంతత లేకుండా మానసిక ఒత్తిడితో పని చేస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం పనిభారం తగ్గించి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంగన్వాడీలు జయలక్ష్మి, రామలక్ష్మి, అంజలి, తులసి లక్ష్మి, హేమలత, ఉమాదేవి, అరుణకుమారి, గంగాభవాని, కోమల, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

బాల సంజీవిని 2.0తో మానసిక ఆందోళన

కశింకోట : మండలంలోని జె.తుని గ్రామంలో అంగన్వాడీ టీచర్ల సెక్టార్ సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.నాగశేషు మాట్లాడుతూ ప్రస్తుత పని భారం చాలదన్నట్లు బాల సంజీవిని 2.0 న్యూ వర్షన్‌తో ఒక యాప్ రిలీజ్ చేసి ఇందులో కూడా వర్కర్, హెల్పర్, ఫోటో క్యాప్చర్ తీసుకొని ప్రతి లబ్ధిదారునికి ఫోటో క్యాప్చర్ తీసి వాళ్ళకి పోషకాహారం పంపిణీ చేయాలని చెబుతున్నారని తెలిపారు. దీనికి ప్రభుత్వం ఇచ్చిన మొబైల్స్ సపోర్ట్ చేయడం లేదన్నారు. తమకు ఇచ్చే వేతనం వర్కర్‌కి రూ.11,500, హెల్పర్‌కి రూ.7000, మినీ వర్కర్‌కు రూ.7000 ఇస్తూ ప్రభుత్వ ఉద్యోగులకు చెప్పే పని అంతా కూడా తమతోనే చేయిస్తున్నారని తెలిపారు. కనీసం వేతనం అమలు చేయాలని, బాల సంజీవిని 2.0 యాప్‌ను సవరణ చేయాలని, గ్రామాల్లో ఇచ్చే పెన్షన్ల నుంచి అంగన్వాడీలను మినహాయించాలి, పని భారం తగ్గించాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు.



మాట్లాడుతున్న యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగశేషు

తెలుగు తమ్ముళ్ల ఫ్లెక్సీ వార్

పార్టీ జిల్లా అధ్యక్షుడు బత్తుల ఫొటో లేకపోవడంపై నిలదీత

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట

మండలంలో తెలుగుతమ్ముళ్ల మధ్య వర్గ విభేదాలు బయటపడ్డాయి. ఫ్లెక్సీల్లో టిడిపి జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు ఫొటో లేకపోవడంపై ఆయన వర్గీయులు అసహనం వ్యక్తం చేశారు. బుచ్చయ్యపేటలో గురువారం జరిగిన టిడిపి కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంలో ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్ రాజు సమక్షంలోనే టీడీపీ కార్యకర్తల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. టీడీపీ సమావేశం సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలలో టిడిపి జిల్లా అధ్యక్షుడు, స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు ఫొటో ఏర్పాటు చేయకపోవడంపై ఆయన వర్గీయులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కష్టకాలంలో ఐదేళ్లపాటు పార్టీ ఇన్చార్జిగా పనిచేసి జిల్లా అధ్యక్షుడిగా కొనసాగుతున్న తాతయ్యబాబు ఫొటో ఫ్లెక్సీలలో కావాలనే పెట్టలేదని మండల టిడిపి నాయకులను ఎలిశెట్టి గణేష్, సయ్యపురెడ్డి మాధవరావు, తలారి శంకర్, గురుమూర్తి, కోవెల వెంకటరమణలతో పాటు పలు గ్రామాల టిడిపి కార్యకర్తలు నిలదీశారు. దీనిపై కొద్దిసేపు వాగ్వాదం చోటు చేసుకుంది. సమావేశ ప్రాంగణంలో గందరగోళం ఏర్పడింది. ఎన్నికల ముందు టీడీపీ కోసం కష్టపడిన వారిని అధికారంలోకి వచ్చాక పూర్తిగా పక్కన పెట్టేశారని, వైసీపీ, ఇతర పార్టీల నుండి వచ్చిన వారికే ప్రాధాన్యం కల్పిస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి



పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బండారు

ప్రజాశక్తి-కె.కోటపాడు : రైతుల సంక్షేమమే ధ్యేయంగా తెలుగుదేశం ప్రభుత్వం పనిచేస్తుందని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. మండలంలోని పాతవలస, దాలివలస, సింగన్న దొరపాలెం, ఏ కోడూరు గ్రామాల్లో కోటి అరవై లక్షల రూపాయలతో సిసి రోడ్లు, వాటర్ ట్యాంక్, పశువుల నీటి తొట్టెల నిర్మాణ పనులను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు వాణిజ్య పంటల సాగుకు ఆసక్తి చూపించాలన్నారు. జీడి మామిడి పామాయిల్ తదితర పంటలకు మూడు సంవత్సరాల వరకు ప్రభుత్వం పెట్టుబడి సాయం అందిస్తుందన్నారు. నీటి కుంటల వల్ల రైతులకు ఎంతో మేలు జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వెలమ సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ పివిజి కుమార్, టిడిపి మండల అధ్యక్షుడు రొంగలి మహేష్, పాతవలస సర్పంచ్ జామి శ్రవణ్, నాయకులు పూడి నారాయణమూర్తి, దాడి ఎరుకనాయుడు, సబ్బవరపు రామునాయుడు తదితరులు పాల్గొన్నారు.

పాలిసెట్‌కు ఉచిత శిక్షణ ప్రారంభం

ప్రజాశక్తి-కశింకోట

కశింకోట ఆర్ఇసిఎస్ పాలిటెక్నిక్ కళాశాలలో పాలిసెట్‌కు ఉచిత శిక్షణా తరగతులను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి.ఉమా శంకర్ గురువారం ప్రారంభించారు. ఆర్ఇసిఎస్ పరిధిలోని వినియోగదారుల పిల్లలు, జిల్లాలోని 10వ తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శిక్షణకు వచ్చే ప్రతి విద్యార్థికీ స్టడీ మెటీరియల్ కూడా ఉచితంగా ఇవ్వనున్నట్లు చెప్పారు. పాలిటెక్నిక్లో ఏ బ్రాంచ్ తీసుకోవాలి, ఉద్యోగావకాశాలు స్కోప్ ఎలా ఉంటాయి వంటి అంశాలపై కెరీర్ కౌన్సెలింగ్ కూడా ఇవ్వబడుతుంది తెలిపారు. పాలిసెట్‌కు ఇంకా దరఖాస్తు చేయకపోతే తమ కళాశాలలో ఉచితంగా దరఖాస్తు చేయబడుతుందని పేర్కొన్నారు. శిక్షణా తరగతులు ప్రతి రోజు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు జరుగుతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో అసోసియేట్ ప్రిన్సిపల్ కర్రి శివ, జనరల్ సెక్షన్ విభాగాధిపతి ఎస్.గణేష్, ఎలక్ట్రికల్ విభాగాధిపతి పి.రమణకుమార్, సీనియర్ లెక్చరర్లు వై.వీరేంద్ర, ఎం.జగదీష్ పాల్గొన్నారు.

ప్రజాదర్బార్‌లో వినతుల స్వీకరణ

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : బుచ్చయ్యపేటలో టిడిపి కార్యాలయంలో గురువారం నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్.రాజు టిడిపి కార్యకర్తలు, ప్రజల నుండి వినతి పత్రాలు స్వీకరించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఎల్లప్పుడూ తాను అందుబాటులో ఉంటానని ఎమ్మెల్యే తెలిపారు. బుచ్చయ్యపేటలో ప్రతి గురువారం ప్రజాదర్బార్ నిర్వహిస్తామని చెప్పారు. వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపిపి నాగేశ్వరిదేవి, ఎంపిడిఓ వి.విజయలక్ష్మి, తహసిల్దార్ ఎం.లక్ష్మి, విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, మాజీ ఎంపీపీ ఎంవివి సత్యనారాయణ, సర్పంచ్ సుంకర లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వైసిపి మండల అధ్యక్షునిగా శంకరరావు



ప్రజాశక్తి-అచ్యుతాపురం : వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అచ్చుతాపురం మండల శాఖ అధ్యక్షుడిగా దేశంశెట్టి శంకర్రావును మూడవసారి పార్టీ అధిష్టానం నియమించింది. శంకర్రావు నియామకం పట్ల పార్టీ నాయకులు పలువురు అభినందన తెలిపారు. తనను మండల శాఖ అధ్యక్షులుగా నియమించినందుకు పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డికి, జిల్లా అధ్యక్షులు బూడి ముత్యాల నాయుడు, కరణం ధర్మశ్రీకి, మాజీ ఎమ్మెల్యే కనబాబురాజుకు శంకర్రావు కృతజ్ఞతలు తెలిపారు.

భగీరథ జయంతిని రాష్ట్ర పండగగా జరపాలని వినతి

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : భగీరథ జయంతిని రాష్ట్ర పండగగా జరిపించాలని కోరుతూ రాష్ట్ర బిసి సంక్షేమశాఖ మంత్రి ఎస్.సవితకు బిసి నాయకులు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు వెలగపూడి సచివాలయంలో గురువారం మంత్రిని కలిసి సన్మానం చేసి, వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో బిసి నాయకులు పూతి కోటేశ్వరరావు, ధోనద్రి అప్పలనాయుడు, గుర్రం నూకరాజు తదితరులు పాల్గొన్నారు.



బిసి సంక్షేమశాఖ మంత్రి సవితను సత్కరిస్తున్న దృశ్యం

ఆదివాసీలపై కేసుల నమోదు అన్యాయం

- ఎక్సైజ్ స్టేషన్ వద్ద ఆందోళన



నినాదాలు చేస్తున్న సిపిఎం నేతలు, గిరిజనులు

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:సాంప్రదాయ జీలుగుకల్లు దొరికిందని ఆదివాసీలపై క్రిమినల్ కేసులు నమోదు చేయడాన్ని ఖండిస్తూ గురువారం ఆంధ్రప్రదేశ్ గిరిజన సంఘం, పీవీటీజీ సంఘం ఆధ్వర్యంలో నర్సీపట్నం ఎక్సైజ్ స్టేషన్ వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ఆదివాసీ గిరిజన సంఘం 5వ షెడ్యూల్ సాధన కమిటీ జిల్లా గౌరవ అధ్యక్షులు కే.గోవిందరావు మాట్లాడుతూ, నర్సీపట్నం ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఏప్రిల్ 2వ తేదీన ముగ్గురు ఆదివాసీల దగ్గర 80 లీటర్ల జీలుగుకల్లు దొరికిందని ఆదివాసీలు కొర్ర కొండబాబు, వంతల సురేష్, మర్రి రాజబాబులపై క్రిమినల్ కేసు నమోదు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. మైదాన ప్రాంతాలలో తాటి చెట్లు, ఆదివాసి గూడాలలో జీలుగు చెట్లు ఈ సీజన్‌లో కల్లు ఇస్తాయన్నారు. ఇది సాంప్రదాయ పానీయమే తప్ప కంపెనీలోనూ లేదా కృత్రిమంగా తయారు చేసిన నాటు సారా, బ్రాందీ వంటివి కావన్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాలలో జనవరి నుండి జూన్ మధ్య వరకు పెద్ద ఎత్తున తాటికల్లు తీయడం, వాటిని సేవించడం సాంప్రదాయ ఆనవాయితీగా వస్తుందని చెప్పారు. వీటిపై ఆధారపడి వేలాది వెనకబడిన కులాలు వారు జీవిస్తున్నారన్నారు. అదేవిధంగా ఆదివాసి గ్రామాలలో జీలుగుచెట్లు పెంచుకొని వాటి నుండి వచ్చే పానీయాన్ని సేకరించడంతో పాటు తమ సాంప్రదాయ పండుగలు, క్రతువులలో దానిని తప్పనిసరిగా ఉపయోగిస్తారన్నారు. కల్లు సేకరించడం, దానిని సేవించడం నేరంగా ఎక్సైజ్ శాఖ వారు భావిస్తే మన జైల్లు గ్రామీణ వ్యవసాయ కార్మికులతో నిండిపోతాయన్నారు. బ్రాందీ షాపులు నిర్వహిస్తున్న వారు తమ అమ్మకాలు పెంచుకోవడం కోసం కొందరు ఎక్సైజ్ అధికారులకు భారీగా లంచాలు ఇచ్చి సాంప్రదాయ కల్లు సేకరిస్తున్న వారిపై కేసులు పెట్టిస్తున్నారని విమర్శించారు. జిల్లా కలెక్టర్ వెంటనే జోక్యం చేసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పీవీటీజీ సంఘం నేతలు కొండ తాంబలి వెంకట్రావు, గెమ్మెలి కామేష్ తదితరులు పాల్గొన్నారు



మాట్లాడుడుతున్న ఎడి

విద్యుత్ బకాయి బిల్లులు చెల్లించాలి

ప్రజాశక్తి రావికమతం: మండలంలో 28 గ్రామ పంచాయతీలకు సంబంధించిన విద్యుత్తు బకాయి బిల్లులను తక్షణమే చెల్లించాలని వడ్డాది సబ్ డివిజన్ ఏడి ఏ.రమేష్ కుమార్ పంచాయతీ కార్యదర్శులను కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీడీవో వెంకన్న బాబు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మండలంలో కోటి 86 లక్షల విద్యుత్ బిల్లులు బకాయి ఉందని, వాటిని తక్షణమే చెల్లించాలని ఆయన కోరారు. వీటిని 2025 జనవరి 31 నాటికి గ్రామపంచాయతీలు చెల్లించాల్సి ఉన్నప్పటికీ ఇంకను చెల్లించలేదన్నారు. పంచాయతీ విద్యుత్ బకాయి చెల్లింపులకు కొంత సమయం ఇవ్వాలని కార్యదర్శులు ఏడిను కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకన్న బాబు, ఈవోపీఆర్డీ బానోజీరావు పాల్గొన్నారు.



కొనుగోలు చేస్తున్న స్పీకర్ దంపతులు

చిరు వ్యాపారులకు అండగా నిలవాలి

- స్పీకర్ అయ్యన్నపాత్రుడు

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:గొలుగొండ మండలం లోని లింగంపేట నూకాలమ్మ ఉత్సవాన్ని స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు సందర్శించారు. తక్కువ పెట్టుబడితో స్టీల్ ఉత్పత్తులు విక్రయిస్తున్న ఓ రోడ్డు వ్యాపారిని కలుసుకుని, అతని కృషిని అభినందించారు. పండగలు, తీర్థాలలో చిన్న చిన్న వ్యాపారస్తులు తమ వ్యాపారాలతో సందడి చేసేవారని, కానీ ఇప్పుడు ఆ ఆనవాయితీ తగ్గిపోతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మరల ఆ సంస్కృతిని తీసుకురావాలని అభిప్రాయపడ్డారు. చిన్న స్థాయి వ్యాపారులు బలపడాలంటే, ప్రజలంతా కలిసి వారిని ఆదరించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంలో ఆలయ పరిసరాల్లోని వ్యాపారులను సందర్శించి, వారి యోగక్షేమాలను తెలుసుకున్నారు. అక్కడ గాజులు, ఇత్తడి, స్టీల్ పూజా సామాగ్రిని స్వయంగా కొనుగోలు చేశారు. ప్రతి ఒక్కరూ చిన్న వ్యాపారులను ప్రోత్సహించాలని సూచించారు.

అంగన్వాడీలపై పని భారం తగ్గించాలి



ఆవేదన వ్యక్తం చేస్తున్న అంగన్వాడీలు

ప్రజాశక్తి -నక్కపల్లి:అధిక పని భారంతో మానసిక ఒత్తిడికి లోనవుతున్నామని అంగన్వాడీలు ఆవేదన వ్యక్తం చేసారు.నక్కపల్లి వీవర్స్ కాలనీలో అంగన్వాడి సెంటర్ నందు గురువారం సెక్టార్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అంగన్వాడీలు తమ గోడును విన్నవించారు. ఈ సందర్భంగా అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎం. దుర్గారాణి మాట్లాడుతూ, బాల సంజీవిని 2.0 యాప్ న్యూ వెర్షన్‌తో అంగన్వాడి ఉద్యోగులు మానసిక ఆందోళనకి గురువుతున్నారని ఆవేదన వ్యక్తం చేసారు. అంగన్వాడి ఉద్యోగులకు కనీస వేతనం అమలు చేయాలని, పనిభారం తగ్గించాలని డిమాండ్ చేస్తూ ఉంటే అవన్నీ పక్కన పెట్టి అనేక యాప్ లు ద్వారా పని భారాన్ని పెంచే పనిలో ప్రభుత్వ ఉందన్నారు. ఇప్పటికే పోషణ ట్రాకర్, ఎఫ్ ఆర్ ఎస్ యాప్ ద్వారా లబ్ధిదారులకు పోషకాహారం పంపిణీలో ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఇది చాలదు అన్నట్లు బాల సంజీవిని 2.0 న్యూ వర్షన్ యాప్ లో కూడా వర్కర్ , హెల్పర్ , ఫోటో క్యాప్చర్ తీసుకొని ప్రతి లబ్ధిదారునికి పోషకాహారం పంపిణీ చేయాల్సి వస్తుందన్నారు.ఇన్ని యాప్ లలో ఆన్లైన్ వర్క్ చేయాల్సి వస్తుందన్నారు. ఆఫీస్ నుంచి ఇచ్చే మొబైల్స్ సపోర్ట్ చేయడం లేదని, మారు మూల ప్రాంతాల్లో సిగ్నల్స్ లేకపోవడం కారణంగా టెక్నికల్ సమస్యలతో ఆటంకాలు ఏర్పడుతున్నాయన్నారు. వీటికి తగ్గట్టు పరికరాలు ఇవ్వాలన్నారు. గ్రామాల్లో ఇచ్చే పెన్షన్ లో కూడా అంగన్వాడి ఉద్యోగులను భాగస్వాములు చేయడం సరికాదన్నారు. అంగన్వాడీలపై పని భారం తగ్గించాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, ట్యాబ్ ఇచ్చి 5 జి నెట్వర్క్ రీఛార్జ్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు అంగన్వాడీలు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ రఘువర్మ

శక్తి వారియర్ గ్రూపుల ఏర్పాటు

ప్రజాశక్తి -రావికమతం: అనకాపల్లి జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు రావికమతం మండల పోలీస్ స్టేషన్ పరిధిలో అన్ని పాఠశాలల్లోనూ శక్తి వారియర్ గ్రూపులను ఏర్పాటు చేయడం జరిగిందని ఎస్ఐ రఘువర్మ తెలిపారు. స్థానిక హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రతి తరగతిలోనూ ఐదుగురు బాలికలు ఒక శక్తి వారియర్ గ్రూపుగా ఏర్పడి, ఒకరు ఈ గ్రూపునకు లీడర్ గా వ్యవహరిస్తారన్నారు. ప్రతి గ్రూపుకు ఒక నాయకురాలును ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. ఈ గ్రూపులన్నింటిని మార్గదర్శకాలు చూపించడానికి ఒక ఉపాధ్యాయుడిని నియమించడం జరుగుతుందన్నారు. ప్రాథమిక సమస్యలు, భద్రతా సమస్యలు గురించి తెలియజేయాలన్నారు.



పెళ్లి రాట వేస్తున్న అర్చకులు, గ్రామ పెద్దలు

ఉపమాకలో శివపార్వతుల పెళ్లి రాటోత్సవం

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని ఉపమాక లో భువనేశ్వరి దేవి సమేత లక్ష్మణేశ్వర స్వామి వారి దేవస్థానంలో గురువారం శివపార్వతుల పెళ్లి రాటోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు మహేష్, వెంకన్న ఆలయ ప్రధాన అర్చకులు వరప్రసాదాచార్యులు, గ్రామ పెద్దలు కలిసి భక్తుల సమక్షంలో వేదమంత్రోచ్చారణ నడుమ పెండ్లి రాటోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ నెల 8 నుంచి 12 వ తేదీ వరకూ స్వామివారి కల్యాణోత్సవాలు జరుగుతాయని ఆలయ అర్చకులు మహేష్ వెల్లడించారు. వెంకన్న ఆలయ మాజీ చైర్మన్ కొప్పిశెట్టి బుజ్జి మాట్లాడుతూ ఘనంగా నిర్వహించడానికి భక్తులు సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గోపాలాచార్యులు , యువిఎస్ రావు, సర్పంచ్ ప్రగడ వీరబాబు, కొప్పిశెట్టి కొండబాబు, తెలుగుదేశం పార్టీ మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్, శివాలయం మాజీ చైర్మన్ సిహెచ్ వెంకటేశ్వరరావు, కష్ణ, రమణ, కొల్లాటి బుజ్జి, కొప్పిశెట్టి శ్రీను పాల్గొన్నారు.

పలు చోట్ల ఉపాధి హామీ పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్

ప్రజాశక్తి - చీడికాడ:ప్రజలు ఎవరు కూడా కూలి పనుల నిమిత్తం గ్రామాలు వీడికి వలస వెళ్లకూడదని సదుద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని గ్రామ సర్పంచ్ సూర్య నాయుడు కోరారు. చీడికాడ మండలం జి కొత్తపల్లి గ్రామంలో తామర చెరువులో ఎంజిఎన్ఆర్ఇజిఎస్ ఉపాధి హామీ పనులును గ్రామ సర్పంచ్ సర్పంచ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపిటీసీ కొల్లి నాగమణి, ఎన్ఆర్ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్ కొల్లి సరోజినీ పాల్గొన్నారు.

రావికమతం: మండలంలో కన్నంపేట గ్రామంలో ఉపాధి హామీ పనులను గురువారం ప్రారంభించారు. గ్రామంలో సువర్ణపేట చెరువులో ఈ పనులను చేపట్టడం జరిగిందని గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ దంట్ల రాజేష్, నీటి సంఘం వైస్ ప్రెసిడెంట్ దంట్ల సత్యనారాయణ , పలువురు కూటమి నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సొంత గ్రామంలోనే ఉపాధి హామీ పథకం ద్వారా పనులను కల్పించడం ఎంతో ఆనందదాయకమన్నారు. ఈ పనిని ప్రజలు అందరూ సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. జాబ్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరూ ఈ పనిలోకి రావాలన్నారు.ఈ కార్యక్రమంలో నీటి సంఘం డైరెక్టర్ శ్రీరామ్ మూర్తి, వార్డు మెంబరు పైలా కృష్ణ పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ కళాశాలలో ఫ్రీ కోచింగ్

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: రాష్ట్రంలో వివిధ ప్రభుత్వ, ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలలలో ప్రవేశాలకు జరిగే పాలీసెట్ 2025 ఎంట్రన్స్ పరీక్షల్లో భాగంగా నర్సీపట్నం పాలిటెక్నిక్ కళాశాలలో 10వ తరగతి పూర్తి చేసిన విద్యార్థులకు ఉచిత కోచింగ్ ఇస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ జీవీ.రామచంద్రరావు తెలిపారు. ప్రతీ రోజు ఉదయం 9.30 గంటల నుంచి 12 గంటల వరకు కోచింగ్ ఇవ్వడం జరుగుతుం దన్నారు. పది పూర్తి చేసిన విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

గోదాములో తనిఖీలు

ప్రజాశక్తి -కోటవురట్ల:మండల కేంద్రంలోని ప్రజా పంపిణీ గోదామును తహసిల్దార్ తిరుమల బాబు గురువారం తనిఖీ చేశారు, గోదాములో ఉండాల్సిన సరుకులు, ప్రస్తుతం ఉన్న సరుకుల వివరాలు సరి చూశారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కడ ఉన్న గోదాము నుంచి కోటవురట్ల, మాకవరపాలెం మండలాలకు ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా నిత్యవసర వస్తువులను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు, ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ కృష్ణ, గోదాము సిబ్బంది పాల్గొన్నారు.



తనిఖీలు చేస్తున్న తహాశీల్దార్

బిఎస్ఎన్ఎల్ టవర్‌కు శంకుస్థాపన

ప్రజాశక్తి -రావికమతం: మండలంలో కవగుంట గ్రామంలో బిఎస్ఎన్ఎల్ నూతన టవరు నిర్మాణానికి సర్పంచ్ దాసరి సూర్యకుమారి గురువారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలో నెట్వర్క్ లేక అధికారులు, ప్రజలు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు ,అలాగే పలు రకాల సర్వేలు నిర్వహించాలంటే నెట్ తప్పనిసరిగా అవసరమన్నారు. తమ గ్రామానికి నెట్ సౌకర్యం లేకపోవడంతో గ్రామ పొలిమేర దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. తహసిల్దారు గ్రామంలో ప్రభుత్వ భూమిని కేటాయించారని తెలిపారు.

లేటరైట్ అనుమతులను రద్దు చేయండి

- సిపిఎం జిల్లా కార్యదర్శి కోటేశ్వరరావు

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:లేటరైట్ అనుమతులు రద్దు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. గురువారం నర్సీపట్నం సిపిఎం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నాతవరం మండలం సుందరపుకోట పంచాయతీ బమిడికలొద్దులో వైయస్.జగన్ ప్రభుత్వం హయంలో జరిగిన తవ్వకాలను వ్యతిరేకించిన తెలుగుదేశం కూటమి పార్టీల నాయకులు అధికారం చేపట్టిన తర్వాత తవ్వకాలకు సిద్ధపడటం దుర్మార్గమన్నారు. లేటరైట్ తవ్వకాలు చేపడితే బమిడికలొద్దు ప్రాంతంలో తరతరాలుగా జీడి మామిడి పంటలు వేసుకుని జీవిస్తున్న గిరిజనుల ఉపాధి కోల్పోతారన్నారు. పర్యావరణం సర్వనాశనం అవుతుందని, అటవీ సంపద దెబ్బతింటుందని చెప్పారు. సరుగుడు ప్రాంతంలోని జలపాతం పూర్తిగా సర్వనాశనం అయిపోతుందని అన్నారు. ఈ ప్రాంతం షెడ్యూల్ ఏరియాలో ఉందని గిరిజన చట్టాలకు, పీసా చట్టాలకు తూట్లు పొడుస్తూ గిరిజన మనుగడకే ప్రమాదకరంగా మార్చడం సరికాదన్నారు. బినామీ పేర్లతో ఇచ్చినటువంటి లేటరైట్ తవ్వకాలకు అనుమతులు రద్దు చేయాలని, గిరిజన చట్టాలను గిరిజనుల మనుగడను కాపాడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు అడిగర్ల రాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కోటేశ్వరరావు



డ్యాన్సు వేస్తున్న విద్యార్థులు

ఘనంగా వార్షికోత్సవం

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలో పెదబోదుగల్లం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం చోడిశెట్టి సత్యనారాయణ ఆధ్వర్యంలో గురువారం వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పదో తరగతి పరీక్షలు పూర్తయిన తర్వాత వార్షికోత్సవ వేడుకలు నిర్వహించాలని 10వ తరగతి విద్యార్థుల విజ్ఞప్తి మేరకు గురువారం ఉదయం నుండి సాయంత్రం వరకు జూనియర్ విద్యార్థులు ఎంతో ఉత్సాహంతో వార్షికోత్సవ దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థుల కేరింతల నడుమ ఉల్లాసంగా,ఉత్సాహంగా అనేక సాంస్కృతిక కార్యక్రమాల తోపాటు ,ఆటపాటలతో,డ్యాన్స్ లతో ఆద్యంతం అదరగొట్టారు. ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎస్.వి.ఎస్.ఆచార్యులు, ఎస్.ఫాల్గుణరావు, కుమారి, కె.రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బృందం సభ్యులు

పిహెచ్‌సిలో

కేంద్ర వైద్య ఆరోగ్యశాఖ బృందం తనిఖీలు

ప్రజాశక్తి-రోలుగుంట:రోలుగుంట మండలం బుచ్చింపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కేంద్ర వైద్య ఆరోగ్య బృందం వాసంత రెడ్డి, హిమబిందులు గత రెండు రోజులుగా తనిఖీలు చేపట్టారు. వైద్యాధికారులు, వైద్య సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. రోగులకు నాణ్యత ప్రమాణాలతో వైద్యాన్ని అందిస్తున్నారా లేదా అనే దానిపై తనిఖీ చేశారు. రికార్డ్‌ను తనిఖీ చేశారు.ఆసుపత్రికి వచ్చిన రోగులకు సరైన వైద్యం అందుతుందో లేదో రోగులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సి వైద్యాధికారులు సునీత, శ్రీనివాస్‌రాజు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు

ప్రజాశక్తి - మాడుగుల:మాడుగుల కేంద్రంతో పాటు మండలంలో ఏ మారుమూల గ్రామంలోనైనా తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవలసిన బాధ్యత పంచాయతీ కార్యదర్శులదేనని ఎంపీడీవో కొంకి అప్పారావు సూచించారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, వేసవి కారణంగా తాగునీటి సమస్యతో అనేక గ్రామాల్లో ప్రజలు ఇబ్బంది పడే పరిస్థితి ఉంటుందని అన్నారు. ఎక్కడా ప్రజలు తాగునీటి సమస్యతో అవస్థలు పడకుండా చర్యలు తీసుకొని ముందస్తుగా దృష్టి సారించాలన్నారు. తాగునీరు లేక గెడ్డలు, ఊటలు, నేల బావుల నుండి తాగునీరు తెచ్చుకుని తాగడంతో ప్రజలు అనారోగ్యం పాలవుతున్న పరిస్థితిని గుర్తించుకోవాలని అన్నారు. తాగునీటి సమస్య ఉన్న వెంటనే తమ దృష్టికి తీసుకువస్తే మాడుగుల శాసనసభ్యులు బండారు సత్యనారాయణమూర్తికి తెలియపరుస్తామన్నారు. ఈ విషయంలో నిర్లక్ష్య ధోరణి అవలంబించవద్దని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్డబ్ల్యుఎస్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకుండా...

పోర్టు ఏర్పాటు తగదు

ప్రజాశక్తి- నక్కపల్లి:రాష్ట్ర కేబినెట్ సమావేశంలో నక్కపల్లి మండలం డిఎల్ పురంలో ఆర్సెలార్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ కోసం పోర్ట్ ఏర్పాటుకు తీసుకున్న నిర్ణయాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని, నిర్వాసితుల సమస్యలు పరిష్కారం చేయకుండా ఎలా ఏర్పాటు చేస్తారని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అప్పలరాజు ప్రశ్నించారు. మండలంలోని డిఎల్ పురంలో గురువారం రాష్ట్ర కేబినెట్‌లో తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ నిర్వాసితులతో కలిసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అప్పలరాజు మాట్లాడుతూ, నక్కపల్లి మండలంలో వైజాగ్ - చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్‌లో భాగంగా ప్రభుత్వం ఆర్సెలార్ మిట్టల్, నిప్పన్ స్టీల్ ఏర్పాటుకు ఇప్పటికే 2,200 ఎకరాలు భూమి కేటాయింపు చేసారన్నారు. స్టీల్ ప్లాంట్, పోర్ట్ ఏర్పాటుకు ఉన్న శ్రద్ధ, భూములు త్యాగం చేసిన రైతులు, భూమి లేని కూలీలు, సముద్రమే జీవనాధారం గా జీవిస్తున్న మత్స్యకారులపై లేదన్నారు. సాగు భూములకు పరిహారం చెల్లించకుండా,డి ఫారం లో తోటలకు నష్టపరిహారం చెల్లించకుండా 2013 భూ సేకరణ చట్టాలను ఉల్లంఘించి, పర్యావరణ నిబంధనలు పాటించకుండా, ప్రజాభిప్రాయ సేకరణ, గ్రామ సభలు ఏర్పాటు చేయకుండా ఏకపక్షంగా పనులు ఎలా ప్రారంభిస్తారు అని ప్రశ్నించారు. ప్రభుత్వం నిర్వాసితులను పట్టించుకోకుండా నిలువునా మోసం చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి ప్యాకేజీ, ప్రతీ సెంటు భూమికి, ప్రతీ చెట్టు కు పరిహారం చెల్లించిన తర్వాతే పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కిల్లాడి రామకృష్ణ, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎం.సత్యనారాయణ, మండల కార్యదర్శి ఎం.రాజేష్, కె.ప్రసాద్, బి.రాము,ఎల్. సూర్యారావు, కె.తాతాలు, కె.కృష్ణ, కె.అప్పారావు, జి.చిరంజీవి, జి.గోవింద్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న అప్పలరాజు

సంతలో ప్రభుత్వమే షెడ్లు నిర్మించాలి : సిపిఎం

నక్కపల్లి:నక్కపల్లి వారపు సంతలో బుధవారం జరిగిన అగ్ని ప్రమాదంలో చిరు వ్యాపారుల పాకలు దగ్ధమవ్వడం చాలా బాధాకరమని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం అప్పలరాజు అన్నారు. గురువారం ఉదయం అప్పలరాజు, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎం సత్యనారాయణ, మండల కార్యదర్శి ఎం.రాజేష్‌లు అగ్నికి కాలి బూడిదైన పాకలను పరిశీలించారు. చిరు వ్యాపారులు తమ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అప్పలరాజు మాట్లాడుతూ,వ్యాపారస్తులు నిర్మించుకున్న కమ్ములు పాకలు పూర్తిగా అగ్నికి దగ్ధం అవ్వడంతో చిరు వ్యాపారులు పూర్తి గా నష్టం పోవడం జరిగిందని తెలిపారు.ఎంపీడీవో డి సీతారామరాజు, తహసిల్దార్ నరసింహమూర్తిలను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బర్నికాన రాము, కొర్రా ప్రసాద్, వ్యాపారులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలపై అవగాహన

ప్రజాశక్తి- మాడుగుల:భూసార పరీక్షల ఆధారంగా నే ఎరువులు వాడాలని మండల వ్యవసాయశాఖ అధికారి ఎం.వాసుదేవరావు తెలిపారు. మండలంలోని సాగరం, వీరనారాయణం గ్రామాల్లో రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తొలకరి పంటలు వేసే రైతాంగం నుంచి మట్టి నమూనాలు సేకరించి మట్టి నమూనా పరీక్షలు చేసిన అనంతరం వాటి ఫలితాలు ఆధారంగా ఎరువులు వాడకం చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల పెద్దలు, రైతులు పాల్గొన్నారు.


దుకాణాలను పరిశీలిస్తున్న ఎంపిడిఒ

కోళ్ల వ్యర్థాలను ఊరికి దూరంగా తరలించండి

ప్రజాశక్తి- మాడుగుల: కోడి వ్యర్థాలను ఊరికి దూరంగా తరలించాలని ఎంపీడీవో కొంకి అప్పారావు తెలిపారు. మండలంలోని కేజేపురం పంచాయతీని సందర్శించారు. గ్రామంలో పరిసరాలు, పరిశుభ్రత, డ్రైనేజీలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో చికెన్ సెంటర్లల్లో కోడి వ్యర్థాలను ఊరికి దూరంగా తీసుకెళ్లి డంప్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

భద్రాచలానికి ప్రత్యేక బస్సులు

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్:శ్రీరామనవమిని పురస్కరించుకొని విశాఖపట్నం నుంచి భద్రాచలం కు ప్రత్యేక బస్సులను గురువారం నుంచి నడుపుతున్నట్లు, దూర ప్రాంతాలకు అంతరాష్ట్ర బస్సులను కూడా ఈరోజు నుంచే నడపడం ప్రారంభించడం జరిగిందని ఏపిఎస్ ఆర్టీసి డిపో రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు తెలిపారు. ఈ సర్వీసులను సక్రియంగా నడపాలన్నారు. విశాఖపట్నం డిపో ను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అధికారులు, సూపర్వైజర్లు,సిబ్బంది ను సమావేశపరిచారు. ఆయన మాట్లాడుతూ విశాఖపట్నం డిపోలో పరిశుభ్రత మరింత మెరుగుపడాలని, పాసింజర్లను, ప్రయాణికులను ఆకట్టుకునే విధంగా సమయపాలన పాటిస్తూ, మార్గమధ్యలో ప్రయాణికులతో మర్యాదపూర్వకంగా నడుచుకొని ఆర్టీసీ కి మరింత ఆదాయం పెంచాలన్నారు.బస్సుల రిపేర్లు ఎప్పటికప్పుడు చేయాలని, కొత్త బస్సులు బిఎస్సి వారికి కొత్త టెక్నాలజీతో టూల్స్ సప్లై చేసి, ఆదా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజనీర్ కె.రాజశేఖర్, డిపో మేనేజర్ కె.గంగాధర్, అసిస్టెంట్ ఇంజనీర్ రామకృష్ణ, అసిస్టెంట్ మేనేజర్ ఉజ్వల,సేఫ్టీ డ్రైవింగ్ ఇన్స్ట్రక్టర్ ఎం.ఎస్ రావు పాల్గొన్నారు.

బ్యాంకు రుణాలు మంజూరు చేయాలి

- కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్:స్వయం ఉపాధి పొందాలనుకునే అన్ని వర్గాల ప్రజలకు బ్యాంకులు పూర్తి సహకారం అందించాలని, ప్రత్యేక చొరవ చూపాలని, సులభతర విధానాలు పాటిస్తూ రుణాల మంజూరు ప్రక్రియను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ ఆదేశించారు.వివిధ సామాజిక వర్గాల ప్రజల నుంచి దరఖాస్తులను పరిశీలించి త్వరితగతిన క్లియర్ చేయాలని సూచించారు. స్వయం ఉపాధి పొందాలనుకునే వారికి తగిన విధంగా అండగా నిలవాలని చెప్పారు. ఈ మేరకు ఎల్ డిఎం శ్రీనివాస్ ఆధ్వర్యంలో పలువురు బ్యాంకు ప్రతినిధులతో గురువారం కలెక్టరేట్ మీటింగ్ హాలులో ప్రత్యేకంగా సమావేశమై వివిధ అంశాలపై సమీక్షించారు.

రీ సర్వేపై రైతులకు సమాచారం ఇవ్వాలి

ప్రజాశక్తి-కోటవురట్ల:రీ సర్వే జరుగుతున్న గ్రామాల్లో రైతులకు సమాచారం తప్పక అందజేయాలని జిల్లా సర్వే అధికారి, ఐట ఎస్ బాబు ప్రసాద్ తెలిపారు. పైలెట్ ప్రాజెక్టుగా చిన్న బొడ్డేపల్లి గ్రామంలో సందర్శించారు, నోటీసుల పట్ల సర్వే, రెవెన్యూ సిబ్బందికి సూచించారు, రి సర్వే జరుగుతున్న గ్రామాల్లో రైతుల సమక్షంలోనే ఈ సర్వే నిర్వహించాలని ప్రతి ఒక్కరికి నోటీసులు అందజేయా లన్నారు, నోటీసులు అందజేయడంలో నిర్లక్ష్యం చేయరాదని సిబ్బందిని సూచించారు, సర్వే జరుగుతున్న తీరు వివరాలను అడిగి తెలుసుకున్నారు, కార్యక్రమంలో మండల సర్వేయర్ శ్రీనివాస్, రీ సర్వే సిబ్బంది సర్వే అధికారులు పాల్గొన్నారు.


నోటీసులను అందజేస్తున్న జిల్లా సర్వే అధికారి